నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433
E-mail:netinijam93@gmail.com


**నేటి కందం-నేటికి అందం**

ఖాయమ్మగ శ్రేయమునిడు
తీయని వార్తను దెలిపెద !తెలగాణములో
డీయే పెంపొందించి బ
కాయిల చెల్లించగ సరకారు వచించెన్ !!

(తెలంగాణా రాష్ట్రంలో ఉద్యోగుల డీయే లను పెంచడమే కాకుండా బకాయిలు కూడా చెల్లిస్తామని ప్రభుత్వం వారు ప్రకటించారు. ఉద్యోగులు సంతోషంగా ఉన్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

అధికారమే కేంద్రంగా
అవినీతి భూదందా
ప్రభుత్వం పనితీరు
పైన పడే రోజు నింద
నిప్పులేందే పొగ రాదు
నిజం కొంత ఉండి తీరు
జాగ్రత్తగా మసలకుంటే
జనం తీర్పు చేయి జారు



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ శనివారం 10-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:60 పేజీలు:6 వెల: రూ.1/-


# భారత సంతతి మహిళ నవనీతం నావి పిళ్లైకు నోబెల్ శాంతి బహుమతి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 9:భారత సంతతి మహిళకు 2026 నోబెల్ శాంతి బహుమతి దక్కింది. ఈ యేటి నోబెల్ శాంతి బహుమతిని నవనీతం నావిపిళ్లై గెలుచుకున్నారు. ఓస్లోలోని నార్వేయన్ నోబెల్ కమిటీ ఈ అవార్డును ప్రకటించింది. శాంతి, అంతర్జాతీయ న్యాయ స్థాపన కోసం ఆమె తీవ్రంగా కృషి చేసినట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సమితి హై కమిషనర్‌గా 2008లో నావి పిళ్లై నియమితులయ్యారు. 2008, సెప్టెంబర్ ఒకటో తేదీన ఆమె ఆ పోస్టును స్వీకరించారు. సమగ్రమైన ప్రపంచ న్యాయం కోసం ఆమె పోరాటం చేశారు. యుద్ధ నేరాలు, మానవాళిపై నేరాలు, ఊచకోత లాంటి కేసుల్లో కచ్చితంగా ప్రాసిక్యూషన్ అమలు చేశారు.





దక్షిణాఫ్రికాకు చెందిన పిళ్లై.. 1967లో తన స్వంత ప్రావిన్సు నాటల్‌లో ఆమె లా ప్రాక్టీస్ చేశారు. సామాజిక కార్యకర్తలకు గతంలో ఆమె డిఫెన్స్ అటార్నీగా చేశారు. రాబెన్ ఐలాండ్‌లో ఉన్న ఖైదీల హక్కుల కోసం ఆమె పోరాడారు. డర్బన్‌లో ఉన్న భారతీయ తమిళ కుటుంబంలో ఆమె జన్మించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా ఆమె లీగల్‌గా వాదించారు. నెల్సన్ మండేలాకు ఆమె సపోర్టు ఇచ్చారు.

దక్షిణాఫ్రికాలోని నాటల్ యూనివర్సిటీ నుంచి బీఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేశారామె. న్యాయ పట్టాలో మాస్టర్స్‌తో పాటు హార్వర్డ్ వర్సిటీ నుంచి జురిడికల్ సైన్స్‌లో డాక్టరేట్ చేశారు. 1941లో నవనీతం పుట్టారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈక్వాలిటీ నౌ అనే అంతర్జాతీయ మహిళా హక్కుల సంస్థను ఆమె స్థాపించారు. క్వాజులు నాటల్ వర్సిటీలో లెక్చరర్‌గా చేశారు. డర్బర్ వెస్ట్‌విల్లే వర్సిటీలి వైస్‌ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. 1995లో దక్షిణాఫ్రికా హైకోర్టులో తాత్కాలిక జడ్జడీగా చేశారు. ఆ ఏడాదిలోనే యూఎన్ జనరల్ అసెంబ్లీకి అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్‌కు జడ్జీగా ఎన్నికయ్యారు. రువాండాలో 8 ఏళ్లు చేశారు. రేప్, భావస్వేచ్ఛ కేసుల్లో వాదించారు. 2003లో హేగ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు జడ్జీగా ఆమె నియమితులయ్యారు.

ఓస్లోలోని నార్వేయన్ నోబెల్ కమిటీ ఈ అవార్డును ప్రకటించింది. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం 287 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల్లో కొన్ని సంస్థలు కూడా ఉన్నాయి. నోబెల్ పీజ్ ప్రైజ్ నేటితో 125 వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఇప్పటి వరకు 112 మంది వ్యక్తులకు నోబెల్ శాంతి బహుమతి దక్కింది. ఈ అవార్డును అందుకున్న వారిలో 28 సంస్థలు కూడా ఉన్నాయి. రెడ్ క్రాస్ మూడు సార్లు, యూఎన్ రెఫ్యూజీ ఏజెన్సీ రెండు సార్లు నోబెల్ పీస్ ప్రైజ్ గెలుచుకున్నాయి. 112 మంది వ్యక్తుల్లో 20 మంది మహిళలు ఉన్నారు. అయితే గత 15 ఏళ్లలోనే సుమారు 8 మంది మహిళలు నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. పీస్ ప్రైజ్ అందుకున్న అతిపిన్న వయస్కురాలిగా మలాలా యూసుఫ్‌జాయి నిలుస్తుంది. ఆమె 17 ఏళ్ల వయసులో 2014లో ఆ అవార్డు స్వీకరించింది.

అమెరికా అత్యధికంగా 24 నోబెల్ శాంతి పురస్కారాలను అందుకున్నది. యూకే 13, స్విట్జర్లాండ్ 11 అవార్డులతో తర్వాత స్థానాల్లో నిలిచాయి. 19 సందర్భాల్లో నోబెల్ పీస్ ప్రైజ్‌ను ఇవ్వలేదు. 1948లో మహాత్మా గాంధీ హత్యకు గురయ్యారు. ఆ సంవత్సరం పీస్ ప్రైజ్ ప్రకటించలేదు. 12 సార్లు గాంధీ .. శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. కానీ ఆయనకు ఆ అవార్డు దక్కలేదు. 1939లో స్వీడన్ పార్లమెంట్ ఆ అవార్డును అడాల్ఫ్ హిట్లర్‌కు ఇవ్వాలని నామినేషన్ వేసింది. కానీ ఆ తర్వాత ఆ నామినేషన్ వెనక్కి తీసుకున్నది.

# ‘గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్’గా నగరాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం

## ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైదరాబాద్, అక్టోబర్ 9:గ్లోబల్ కంపెనీలకు అవసరమైన సాంకేతిక పరిష్కారాలను అందించే కేంద్రంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకే పరిమితం కాకుండా, ప్రపంచ స్థాయి సమస్యలకు పరిష్కారాలు చూపే ‘గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్’గా నగరాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. గ్లోబల్ ఫిన్‌టెక్ సంస్థ బ్యాక్‌బేస్ ఏర్పాటు చేసిన డెవలప్‌మెంట్ సెంటర్‌ను శుక్రవారం హైటెక్ సిటీలో ఆయన ప్రారంభించారు.

హైటెక్ సిటీలో సుమారు 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో బ్యాక్‌బేస్ ఈ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. నెదర్లాండ్స్‌కు చెందిన ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు డిజిటల్ బ్యాంకింగ్ పరిష్కారాలు, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులను అందిస్తోంది. హైదరాబాద్‌లో కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా తన కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. ఈ కేంద్రం ద్వారా కొత్తగా సుమారు 300 మంది నైపుణ్యవంతులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని మంత్రి తెలిపారు.

టెక్నాలజీ, డిజిటల్ బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో హైదరాబాద్ ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బ్యాక్‌బేస్ వంటి అంతర్జాతీయ సంస్థలు నగరంలో తమ కార్యకలాపాలను విస్తరించడం ఈ రంగాల్లో హైదరాబాద్‌కు ఉన్న అవకాశాలను తెలియజేస్తోందన్నారు. ప్రపంచ మార్కెట్ అవసరాలు, భవిష్యత్ సాంకేతిక మార్పులకు అనుగుణంగా కంపెనీలను ఆకర్షించే సమగ్ర ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.

కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, అంతర్జాతీయ కంపెనీల్లో తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు పెంచడంపైనా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని మంత్రి తెలిపారు. డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ), డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో యువతకు నైపుణ్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

గ్లోబల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా అధునాతన డిజిటల్ మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిష్కారాలు కనుగొనే అవకాశం ఉందని, కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు తదుపరి తరం డిజిటల్ బ్యాంకింగ్ పరిష్కారాలు, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులను అందించడంలో హైదరాబాద్ డెవలప్‌మెంట్ సెంటర్ కీలక పాత్ర పోషించనుందని మంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ సంస్థల కార్యకలాపాలు విస్తరించడం ద్వారా నగరంలో ఉన్నత నైపుణ్యాల ఆధారిత ఉద్యోగాలు పెరిగే అవకాశం ఉందన్నారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నెదర్లాండ్స్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ యాన్ క్రెమర్స్, బ్యాక్‌బేస్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ గ్రెగ్ ఫాహి, చీఫ్ ఆఫ్ స్టాఫ్ రీన్‌హార్డ్ షీల్, ఇండియా సైట్ హెడ్ సురభి శర్మ తదితరులు పాల్గొన్నారు.

# జీఓ 59 దరఖాస్తులకు శుభవార్త

## 500 చదరపు గజాల్లోపు ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు వేగంగా చర్యలు
## కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు.. అర్హులందరికీ న్యాయం జరిగేలా పరిశీలన
## 22-ఏ భూ సమస్యల పరిష్కారానికి వరుస ఉత్తర్వులు
## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్ 9: జీఓ 59 కింద ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 500 చదరపు గజాలు, అంతకంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఈ మేరకు మెమో నంబర్ 48030 జారీ చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ వివరాలను వెల్లడించారు.

జీఓ 59 కింద క్రమబద్ధీకరణ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ వివిధ కారణాలతో అనేక అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. దీంతో చిన్న ఇళ్ల స్థలాలు, ఆస్తులకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం సామాన్యులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిశీలించి, నెల రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గతంలో జారీ చేసిన జీఓ నంబర్లు 14, 22, 29, 41కు అనుగుణంగా ఈ మెమోను విడుదల చేసినట్లు వివరించారు. దరఖాస్తుల పరిశీలనలో భూమి అసలు రికార్డులు, దరఖాస్తుదారుల అర్హత, క్రమబద్ధీకరించాల్సిన విస్తీర్ణం సహా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.

గత ప్రభుత్వ హయాంలో జీఓ 59 అమలులో కొన్ని అక్రమాలు జరిగినట్లు తమ దృష్టికి రావడంతో ఈ ప్రక్రియను నిలిపివేసినట్లు మంత్రి తెలిపారు. అలాంటి తప్పులు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనల ఉల్లంఘనలు లేదా అక్రమాలు ఉన్నట్లు తేలితే ప్రస్తుత నిబంధనల ప్రకారం సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఇప్పటికే క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తయి కన్వేయన్స్ డీడ్లు జారీ చేసిన కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా వ్యవహరించాలని తెలిపారు. న్యాయస్థానాల పరిధిలో ఉన్న దరఖాస్తులు, వివాదాస్పద అంశాలపై సంబంధిత కోర్టులు ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగానే తుది నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

భూ సమస్యల పరిష్కారంపై గత నెల 16న శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22-ఏ జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన సమస్యల్లో 10 నుంచి 12 అంశాలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయడంతోపాటు పలు ఉత్తర్వులు, మెమోలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

22-ఏ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు పొందిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తులు, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. శాసనసభలో ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకువస్తూ 22-ఏ సమస్యల పరిష్కారానికి వరుసగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై బీఆర్ఎస్ మౌనం.. బీజేపీతో లోపాయికారి ఒప్పందమంటూ మహేశ్ ఫైర్





హైదరాబాద్, అక్టోబర్ 9: బీఆర్ఎస్ నేతలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎస్ఐఆర్ ఆందోళన లో బీఆర్ఎస్ ఎక్కడుందని ప్రశ్నించారు. సీఈసీ తప్పిదం చేస్తుంటే హరీశ్ రావు, కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని నిలదీశారు. నిరసన కార్యక్రమం ఎందుకు చేయడం లేదన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఈ-ఫార్ములా కేసులో అరెస్ట్ చేస్తారని, కాళేశ్వరం కేసులో సీబీఐ అరెస్ట్ చేస్తుందని భయమా అని ప్రశ్నించారు. ఉండటానికి ఇల్లు లేదన్న కేటీఆర్‌కు ఫైవ్‌స్టార్ హోటల్స్ ఎలా వచ్చాయని.. ఆయనకు ఇన్ని వేలకోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని నిలదీశారు. వాఎఖీ ప్రక్రియపై దేశ వ్యాప్తంగా బీజేపీ, మిత్ర పక్షాలు తప్ప అన్ని పార్టీలు రోడ్డెక్కాయన్నారు.

‘సర్’లో దళితుల, మైనారిటీ, గిరిజనుల ఓట్లు తొలగిస్తున్నారని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో రోహింగ్యాల పేరుతో మమత బెనర్జీని, బిహార్‌లో ఆర్జేడీని గెలవకుండా ఆపారన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు. జ్ఞానేశ్వర్ కుమార్‌ను తొలగించే వరకు నిరసన ర్యాలీలు కొనసాగుతాయని మహేశ్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనుకుంటే 2009లోనే అయ్యేవారని తెలిపారు. శాశ్వతంగా అధికారంలో ఉండాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను తొలగించారని.. జ్ఞానేశ్వర్ కుమార్ లాంటి తొత్తులను సీఈసీగా పెట్టుకుందని బీజేపీపై విరుచుకుపడ్డారు.

నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. ప్రకాశ్ రాజ్ మాట్లాడే దాంట్లో నిజం లేదన్నారు. ఎస్ఐఆర్ అంశంలో మొదట స్పందించింది కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. అర్హుల ఓట్లు కాపాడటమే తమ లక్ష్యమన్నారు. ప్రకాశ్ రాజ్ అంటే గౌరవం ఉందని.. సామాజిక అంశాలపై ఆయన స్పందిస్తారని తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా ఓట్లు కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## ఏటా 2 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం..
## ఉమ్మడి జిల్లాకో ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రణాళిక
## ఆయిల్‌పామ్ తోటల్లో కోకో అంతరపంటకు ప్రోత్సాహం..
## కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు
## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, అక్టోబర్ 9:ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశాల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతోపాటు ఉద్యాన పంటల సాగును మరింత ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరుగు తుండటం శుభపరిణామమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కూరగాయల ఉత్పత్తిని పెంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ ఎదగాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో ఉద్యాన శాఖ, ఆయిల్‌ఫెడ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతున్న తీరుపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే స్పైసెస్ సాగు 65 శాతం, ఎర్రమిరప సాగు 83 శాతం, ఇతర సుగంధ ద్రవ్యాల సాగు 192 శాతం, పూల సాగు 198 శాతం పెరిగినట్లు అధికారులు వివరించారు. ఈ పురోగతిని కొనసాగిం చడంతోపాటు మరింత విస్తరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

తెలంగాణలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంతోపాటు, ఉత్పత్తి పెంపునకు అవసరమైన సాంకేతిక సహకారం అందించా లని సూచించారు. పంటలకు గిట్టుబాటు ధర లభించేలా మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచాలని ఆదేశించారు. రాష్ట్రంలో పండించిన కూరగాయలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఉద్యాన శాఖ అధికారులకు సూచించారు.

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. సుమారు 20 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగుకు అనుకూలత ఉందని, కనీసం 10 లక్షల ఎకరాల్లో సాగు చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఏడాది 2 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టే లక్ష్యంతో అధికారులు, ఆయిల్‌పామ్ కంపెనీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఆయిల్‌పామ్ గెలల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతుల్లో ఈ పంటపై ఆసక్తి పెరిగే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన మొక్కలను ముందుగానే నర్సరీల్లో సిద్ధం చేయాలని, పంపిణీలో జాప్యం జరగకు ండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో ప్రాసెసింగ్ సదుపాయాలను కూడా విస్తరించాలని మంత్రి సూచించారు. ప్రతి ఉమ్మడి జిల్లాలో కనీసం ఒక ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఫ్యాక్టరీలను సంక్రాంతి నాటికి రైతులకు అందుబా టులోకి తీసుకురావాలని, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆయిల్‌పామ్ సాగులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో వెనుకబడిన కంపెనీల పనితీరును సమీక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహించే కంపెనీలకు కేటాయిం చిన జిల్లాలను రద్దు చేసే విషయంలో వెనుకాడవద్దని అధికారులకు సూచించారు.

ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటగా కోకో సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందే అవకాశా లున్నాయని మంత్రి తెలిపారు. ఈ విధా నాన్ని మరిన్ని ప్రాంతాలకు విస్తరించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కోకో వంటకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని చెప్పారు. తొలిదశలో అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాల్లో కోకో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

వ్యవసాయ, ఉద్యాన శాఖల్లో అమలవుతున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకాలను వేర్వేరుగా కాకుండా, ఏకీకృత నోడల్ ఏజెన్సీ ద్వారా అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. దీనివల్ల పథకాల అమలులో సమన్వయం పెరగడంతోపాటు రైతులకు సేవలు మరింత సమర్థంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణ లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఆయిల్‌ఫెడ్‌లో ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి, అక్టోబర్ నెలాఖరులోగా నియామకాలకు సంబంధించిన ప్రాథమిక ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రెండు, మూడు నెలల్లో నియామక ప్రక్రియను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి: కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి

ఢిల్లీ, అక్టోబర్ 9: సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. ఈసీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఇండియా కూటమి ఎంపీలపై కేంద్రం పోలీసుల ద్వారా రాజ్యం ఏలుతోందని విమర్శించారు.

ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై పోలీసులతో భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీల సమావేశం జరుగనుందని తెలిపారు.

ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ చేపడతామని ఎంపీ అన్నారు. తప్పు చేసిన జ్ఞానేష్ కుమార్, తప్పు చేయించిన మోదీ, అమిత్ షా శిక్షకు అర్హులని వ్యాఖ్యానించారు. ఆందోళనలు అణచివేయడానికి ఛత్తీస్‌గఢ్ నుంచి 7 వేల మంది బలగాలను ఢిల్లీకి తీసుకొచ్చారని మండిపడ్డారు. సీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా చేస్తామని చెప్తే ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థను రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరూ నిరసన చేయకుండా అడ్డుకోవాలని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు.

# ప్రపంచవ్యాప్త సమస్యగా మారిన మానసిక రుగ్మతలు

## (10 అక్టోబర్ 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం' సందర్భంగా)

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం జ్వరం లేకపోవడం మాత్రమే ఆరోగ్యం కాదని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక, సామాజిక కుశలత ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం అవుతుందని వివరిస్తున్నారు. మానసిక ఆరోగ్యం అనగా మన శక్తి సామర్థ్యాలపై మనకు పూర్తి నమ్మకం ఉండడం, ఆ శక్తిని గరిష్టంగా వినియోగించడం, నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడం, పౌర సంబంధాలను కొనసాగించం, సామాజిక బాధ్యతలను నిర్వహించడం లాంటి లక్ష్యాలు మానసిక ఆరోగ్యాన్ని సూచిస్తాయి. మన ఆలోచనలు, భావనలు, ప్రవర్తనలు, సామాజిక సంబంధాల్లో ప్రతికూల ప్రభావాలను మానసిక రుగ్మతలుగా పేర్కొనాలి. మానసిక ఆరోగ్యంతో పిల్లల మానసిక రుగ్మతలు, మాదకద్రవ్యాల వినియోగం, ఆత్మహత్యలు, ఇతర వ్యాధులు సోకడం, పనిలో ఉత్పాదకత, ఆర్థిక అస్థిరత, కుటుంబ సభ్యుల వేదనలు ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉంటాయి. మానసిక అనారోగ్యం ఫలితంగా పిల్లల్లో విద్యలో వెనుకబాటు, మానవ సంబంధాల్లో తేడాలు కనిపిస్తాయి. మానసిక రుగ్మతలను తొలి దశలో గుర్తించడం వల్ల చికిత్సతో నయం చేసుకోవచ్చు.

**ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం:**

ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌజన్యంతో ప్రతియేటా 10 అక్టోబర్ రోజున 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం' పాటించడం ఆనవాయితీ వస్తున్నది. 1992లో ప్రారంభమైన ప్రపంచ మానసిక ఆరోగ్య దినం వేడుకల్లో భాగంగా విశ్వ మానవాళికి మానసిక ఆరోగ్య ప్రాధాన్యతను తెలపడం, మానసిక రుగ్మతలతో బాధ పడుతున్న వారికి చికిత్స అందించడం, మానసిక వికాసానికి పాటించాల్సిన జాగ్రత్తలను వివరించడం జరుగుతుంది. మానసిక దృఢత్వం కలిగిన వారు ఆరోగ్యవంతులుగా ఉంటారని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మానసిక వ్యాధికి మందు లేదనే నానుడి మనందరికి తెలుసు. జీవనోపాధికి బజారుకు వెళ్ళి కాయకష్టం చేసుకునే వారు కూడా నిత్యం విపత్తుల భయం గుప్పిట్లో జీవిస్తూ, మానసిక ఆందోళనకు గురౌతున్నారు. శారీరక అనారోగ్యంగా ఉండే వారు మానసిక దృఢత్వంతో ఉన్నట్లయితే తొందరగా కోలుకున్నారు. ఔషధాలతో నయం కాని రోగాలు మానసిక ధైర్యంతో నయం అవుతాయి. వ్యాధి కన్న భయం ప్రమాదకరమైందని గమనించాలి. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం-2026' ఇతివృత్తంగా "మానసిక రుగ్మతల నుంచి బయట పడిన వారి అనుభవాలను వినడం : వాస్తవ గళాలు, వాస్తవ మార్పులు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తేనే ఆరోగ్య అసమానతలు తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. మానసిక రోగుల్లో పేద, మధ్య ఆదాయ దేశాల ప్రజలు మాత్రమే 75-95 శాతం ఉన్నారని అంచనా. శారీరక ఆరోగ్యానికి మానసిక దృఢత్వం తప్పనిసరి అని అందరం గమనించాలి.

**ప్రపంచ సమస్యగా మానసిక అనారోగ్యం:**

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మానసిక ఆరోగ్య సాధనపై దృష్టి సారించి, పలు జాగ్రత్తలు తీసుకోవలసిన సమయం ఆసన్నమైందని అర్థం చేసుకోవాలి. భయం, ఒత్తిడి, ఉద్రేకం, నిరాశ, అధిక పని ఒత్తిడి, ఒంటరితనం, భావోద్వేగ ఆందోళనలు, నిద్రలేమి, మాదకద్రవ్యాలు, పర్యావరణం, కుటుంబ చరిత్ర, శారీరక ఆరోగ్యం, ఆహారం, ఆర్థిక అభద్రత, సామాజిక సంబంధాలు, పేదరికం, వివక్ష, అపోహలు, దురలవాట్లు, మెదడు గాయాలు, అప్పులు, లాంటివి మానసిక ఆరోగ్యానికి ప్రతిబంధకాలు అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 450 మిలియన్లకు పైగా ప్రజలు మానసిక రుగ్మతలతో సతమతమవుతున్నారని అంచనా. విశ్వవ్యాప్తంగా 13 శాతం అనారోగ్యాలు మానసిక సంబంధమైనవిగా గుర్తించారు. ప్రపంచ పిల్లలు, కౌమార యువతలో 20 శాతం మంది మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని తెలుస్తోంది. ప్రపంచ స్థాయిలో మానసిక ఆందోళనలతో ఏడాదికి 8 లక్షల ఆత్మహత్యలు జరుగుతున్నాయని, అసంఖ్యాకులు ఆత్మహత్యాయత్నం చేస్తున్నారని తేలింది. మానసిక రుగ్మతలు 14 ఏండ్ల లోపు పిల్లల్లో ప్రారంభం అవుతాయని గమనించాలి. మానసిక బలహీనతలతో 79 శాతం ఆత్మహత్యలు దిగువ, మధ్య తరగతి కుటుంబాలలో నమోదవుతున్నాయి. ప్రపంచ ఆర్థిక సమాఖ్య అంచనాల ప్రకారం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మానసిక సంక్షోభం స్థితి వచ్చిందని, అన్ని దేశాల్లో మానసిక రుగ్మతలు పెరుగుతున్నాయని, విశ్వ ఆరోగ్య స్థాపనకు బహుముఖీన మానసిక ఆరోగ్య వికాస చర్యలు అవసరం అవుతాయని గుర్తించారు.

**మానసిక ఆరోగ్య రహస్యాలు:**

మానసిక ఆరోగ్యం ఒక రోజులో సాధించేది కాదని, మన జీవనశైలి, ఆలోచనా విధానంతో దీర్ఘకాలిక జాగ్రత్తలు తీసుకోవడంతోనే సత్ఫలితాలు కనిపిస్తాయి.. మనసు విప్పి గలగల మాట్లాడడం, చలాకీగా ఉండడం, ప్రతి విషయాన్ని తేలికగా తీసుకోవడం, నవ్వటంతో పాటు నవ్వించడం, ఒత్తిడిని జయించడం, ప్రశాంతంగా నిద్ర పోవడం, ఆరోగ్యకర ఆహారం తీసుకోవడం, సమయపాలన పాటించడం, శారీరక వ్యాయామానికి సమయం ఇవ్వడం, మిత్రులతో సమస్యలను చర్చించడం, ధైర్యంగా సమస్యల్ని ఎదుర్కోవడం లాంటి అలవాట్లతో మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని నమ్మాలి. మానసిక ఆరోగ్య పరిరక్షణకు సకారాత్మక అవగాహన కల్పించడం, కుటుంబ సభ్యులు పలు అంశాల్లో మనసు విప్పి మాట్లాడుకోవడం తప్పనిసరి. సమస్యలు లేని జీవితం లేదు. వైఫల్యం రుచి చూడని వీరుడు లేడు. కష్టాలు మనకు మాత్రమే రాలేదు. కష్టసుఖాల సంగమమే జీవితం. విజయంతో విర్రవీగక, అపజయంలో ఆందోళన పడక, మానసిక పరిపక్వతతో అడుగులు వేసిన వారిని మానసిక ఆరోగ్యం వరిస్తుంది.

మానసిక ఆరోగ్యంతోనే పనిలో సఫలత సిద్ధిస్తుందని, అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ, మానసిక ఆందోళన ప్రతికూల ఫలితాలను ఇస్తుంది. మానసిక ఆందోళనతో శారీరక సామర్థ్యం తగ్గుతుంది. మానసిక ఆరోగ్యం పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటూ తమ తమ విధులను నిర్వహిస్తూ మానసిక, సామాజిక, శారీరక ఆరోగ్యాన్ని పొంది దేశాభివృద్ధిలో పాలు పంచుకుందాం.

శారీరక, మానసిక ఆరోగ్యమే మనిషి ప్రగతికి తొలి మెట్టు అవుతుందని గట్టిగా నమ్ముదాం. మానసిక ఆరోగ్యమే మహాభాగ్యమని నినదిద్దాం.



-మధుపాళీ
9949700037

# పని ప్రదేశంలో మానసిక ప్రశాంతత' అంశంపై 'మినీ చింతన్ శిబిరం' నిర్వహించిన ఉక్కు మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 9: న్యూఢిల్లీలోని చాణక్యపురిలో గల సివిల్ సర్వీసెస్ ఆఫీసర్స్ ఇనిస్టిట్యూట్ (సీఎస్ఓఐ) వేదికగా ఉక్కు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ రోజు 'పని ప్రదేశంలో మానసిక ప్రశాంతత' అంశంపై మినీ చింతన్ శిబిరం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు ఒత్తిడి లేని పని వాతావరణాన్ని సృష్టించుకుని... భావోద్వేగ పరమైన బలాన్ని పెంపొందించుకునేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం. ప్రముఖ ఆధ్యాత్మిక వక్త బ్రహ్మ కుమారి సిస్టర్ శివాని ముఖ్య అతిథిగా, ప్రధాన వక్తగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

కార్యక్రమ ప్రారంభంలో ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ సందీప్ పౌండ్రిక్ సభనుద్దేశించి మాట్లాడుతూ... పని ప్రదేశంలో మానసిక ప్రశాంతతను కాపాడ కోవడం చాలా ముఖ్యమన్నారు. అది ఉత్పాదకతను, సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయ పడుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ అంశంపై సిస్టర్ శివాని మాట్లాడుతూ... ఒత్తిడిని తగ్గించుకోవడం, సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవడంపై దృష్టి సారించాలని అధికారులు, ఉద్యోగులకు సూచించారు.

ఏదైనా సాధించాలని మనం దృఢ నిశ్చయం చేసుకున్నప్పుడే దానిని పూర్తి చేసే దిశగా అడుగులు వేయగలమన్నారు. ఒత్తిడిని నిర్వహించే విషయంలోనూ ఇదే విధానాన్ని అనుసరించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రతి పరిస్థితి లోనూ సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండాల్సిన ప్రాముఖ్యతను సిస్టర్ శివాని ప్రముఖంగా ప్రస్తావించారు.

సంకల్ప శక్తిని వివరిస్తూ... ఒక సంకల్పాన్ని పదే పదే తలచుకోవడం వల్ల అది మన జీవితాలపై ప్రభావం చూపడం ప్రారంభిస్తుందని సిస్టర్ శివాని పేర్కొన్నారు. మనం ఏదైనా విషయాన్ని ఎంత ఎక్కువగా ఆలోచిస్తూ, పునరావృతం చేసామో... అది మన ఆలోచనలను, ప్రవర్తనను అంతగా తీర్చిదిదుతుందన్నారు. మన ఆలోచనలు, సంకల్పాలు సానుకూలంగా ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యమని సిస్టర్ శివాని తెలిపారు. ఇదే 'సంకల్పం ద్వారా సిద్ధి' సూత్రమని, ఇది మన సమాజాన్ని, దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించగలదని ఆమె వ్యాఖ్యానించారు.

# నేడు ఆర్థిక చేయూత - రేపు స్వయం సమృద్ధి

న్యూఢిల్లీ, అక్టోబర్ 9: జీవనోపాధి కోసం సకాలంలో అందే ఆర్థిక సహాయం ఒక వ్యక్తి జీవితంలో ఎంతటి మార్పు తీసుకురాగలదో గుంటూరుకు చెందిన శ్రీమతి మణికళా దుర్గ ప్రయాణం చాటిచెబుతోంది. ఆదాయాన్ని పెంచుకోవడం, కుటుంబ ఆర్థిక భద్రతను బలోపేతం చేసుకోవడం, మరింత గౌరవప్రదమైన జీవితం గడపడం, స్వావలంబన సాధించడం వంటి లక్ష్యాలకు ఆర్థిక సహాయం తోడ్పడుతుంది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు సుస్థిర జీవనోపాధిని ఏర్పాటు చేసుకుని తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడంలో ఇటువంటి సహాయం కీలకంగా నిలుస్తుంది.

39 ఏళ్ల శ్రీమతి మణికళా దుర్గ షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) వర్గానికి చెందినవారు. గత 15 ఏళ్లుగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో వ్యర్థాల సేకరణ కార్మికురాలిగా పనిచేస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చిన ఆమెకు చిన్నతనంలో పాఠశాలకు వెళ్లే అవకాశం లేకపోవడంతో నిరక్షరాస్యురాలిగా మిగిలిపోయారు.

ఇన్నాళ్లూ ఆమె జీవనోపాధి ప్రధానంగా వ్యర్థాల సేకరణపైనే ఆధారపడి ఉండేది. ఈ పని ద్వారా నెలకు సుమారు రూ.8,000 మాత్రమే ఆదాయం వచ్చేది. పరిమిత ఆదాయంతో కుటుంబ అవసరాలను తీర్చడంతో పాటు పిల్లలకు మెరుగైన అవకాశాలు కల్పించడం ఆమెకు సవాలుగా ఉండేది.

ఈ పరిస్థితుల్లో మణికళా దుర్గతో పాటు మరో ముగ్గురు సభ్యులకు నేషనల్ సఫాయి జాతీయ పారిశుధ్య కార్మికుల ఆర్థిక, అభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ)కు చెందిన స్వచ్ఛతా ఉద్యమి యోజన (ఎస్‌యూవై) కింద నవజీవన్ సంస్థ ద్వారా ఆర్థిక సహాయం అందింది.

బహిరంగ డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులకు ఉపయోగించే డీ-సిల్టి ంగ్ మెషీన్ (బ్యాక్‌హో బకెట్‌తో కూడిన ఎక్స్‌కవేటర్) కొనుగోలు చేసేందుకు ఈ సహాయాన్ని ముందస్తు మూలధన సబ్సిడీ రూపంలో అందించారు. ఈ బృందం చేపట్టిన ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.35,03,500. ఇందులో రూ.21,27,624 రుణం కాగా.. రూ.13,75,876 మూలధన సబ్సిడీగా ఉంది. ఈ ఆర్థిక సహాయం 2023 జూన్ 19న అందింది.

# సాగరమంథన్ 3వ దఫా సంప్రదింపుల సమావేశానికి పిలుపునిచ్చిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సందేశం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 9: న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న మూడో విడత 'సాగరమంథన్: ది గ్రేట్ ఓషన్స్ డైలాగ్' సదస్సు నేపథ్యంలో నిన్నటి కార్యక్రమానికి అంతర్జాతీయ అగ్రనేతలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వాగతించారు. ప్రపంచవ్యాప్తంగా గల విధాన రూపకర్తలు, సముద్ర రంగ అగ్రగాములు, నిపుణులు ఇందులో పాలొన్నారు. అన్ని దేశాల్లో శాంతి-సౌభాగ్యాగలకు తోడ్పడే "స్వేచ్ఛాయుత, సార్వత్రిక, సురక్షిత, నియమాధారిత సముద్ర రంగ వ్యవస్థ" అవశ్యమని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

"అందరికీ మరింత ప్రగతి, శాంతి-సౌభాగ్యాలనిచ్చే స్వేచ్ఛాయుత, సార్వత్రిక, సురక్షిత, నియమాధారిత సముద్ర వ్యవస్థ సాకారం కావాలన్నదే మా దృక్కోణం. ఈ బృహత్తర దార్శనికతను సాగరమంథన్ మరింత బలోపేతం చేస్తుందని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను" అని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఏడాది కేంద్ర ఓడరేవులు-నౌకాయానం-జలమార్గాల మంత్రిత్వశాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ఆయనొక లిఖితపూర్వక సందేశం పంపారు.

ప్రపంచంలోని ఒక ప్రాంతంలో సంభవించే పరిణామాలు దాని తీరాల ఆవలగల సుదూర ప్రాంతాలనూ ప్రభావితం చేస్తాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆ మేరకు సముద్ర రంగంపై ప్రపంచవ్యాప్త సంప్రదింపులు, సహకారం మునుపటికన్నా ఇప్పుడు మరింత ప్రధానమన్నారు. "సముద్ర మథనం" అనే అర్థమిచ్చే 'సాగరమంథన్'కు భారతీయ సంప్రదాయంలో ఒక ప్రత్యేక అర్థం ఉందని తెలిపారు. ఈ మథనం కొత్త అవకాశాల ఆవిష్కరణతో ముడిపడి ఉంటుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు, ప్రజలకు, భూగోళానికి సముద్రాలు "అపార భరోసా" ఇస్తున్నాయని ఆయన అన్నారు.

"సముద్రంతో భారతదేశానికి గల సంబంధం కూడా బాధ్యతకు సంబంధించినదే. మనం బలమైన సముద్ర ఆర్థిక వ్యవస్థను రూపొందిస్తూనే మన సముద్రాలు, తీరప్రాంత వ్యవస్థల ఆరోగ్యాన్ని మనం కాపాడుకుంటున్నాం. ప్రాంతాలు, సముద్ర రంగమంతటా విస్తరించిన భారత సముద్రరంగ భారత్ దృక్కోణం- సహకారం, విశ్వాసం, పరస్పర గౌరవం- ప్రయోజనాలపై ఆధారపడినది. సముద్రాలు సమష్టి సౌభాగ్యానికి మూలం కావాలని, ప్రతి దేశానికి తనదైన గళం వినిపించగల, అభివృద్ధి చెందగల అవకాశం లభించాలన్నది మా ప్రగాఢ ఆకాంక్ష" అని ప్రధానమంత్రి తన సందేశంలో స్పష్టం చేశారు.

ప్రాచీన రేవు పట్టణమైన లోథాల్ నుంచి చోళ రాజవంశం దాకా? మరాఠా పాలకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ నావికాదళ దార్శనికత వరకూ భారత సముద్రరంగ చరిత్ర విస్తరించిందని మోదీ వివరించారు. భారత నావికులు, వ్యాపారులు తమ వస్తువులతో పాటు ఆలోచనలు, కథలు, సంస్కృతిని సుదూర ప్రాంతాలకు విస్తరింపజేశారని ఆయన అన్నారు. దేశాన్ని 2047 నాటికి వికసిత భారత్‌గా రూపొందించాలన్న ప్రభుత్వ లక్ష్యం దేశ సముద్రరంగ ఆకాంక్షలుతోనూ ముడిపడి ఉందని ప్రధానమంత్రి విశదీకరించారు.

దేశంలోని ప్రధాన ఓడరేవుల సామర్థ్యం నేడు దాదాపు రెట్టింపు దాటిందని, సరకు రవాణా సమయం గణనీయంగా తగ్గిందని అన్నారు. "భారత్ ఒక వినూత్న లక్ష్యంతో సముద్ర రంగంపై దృష్టి సారించింది. దేశం 2047 నాటికి వికసిత భారత్ స్వప్నాన్ని సాకారం చేసుకోవడంలో మరింత పటిష్ట, సమర్థ భారత సముద్రరంగ ప్రస్థానం కూడా కీలకమేనని పేర్కొన్నారు. "నౌకా నిర్మాణం, పర్యావరణ హిత నౌకాయానంలో నవ శకంవైపు మేమిప్పుడు పయనిస్తున్నాం. మా ప్రధాన ఓడరేవుల సామర్థ్యం దాదాపు రెట్టింపును అధిగమిచగా, నౌకలు తిరుగు ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గింది" అని వివరించారు.

దేశంలోని సముద్రాలపై అవగాహనను మరింత పెంచుకోవడానికి, వాటి బాధ్యతాయుత వినియోగానికి వీలుగా సముద్ర శాస్త్రం-అన్వేషణలోనూ ప్రభుత్వం పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. "ఈ రంగం కోసం ఆధునిక చట్రం రూపకల్పన దిశగా భారత్ నవతరం సముద్రయాన చట్టాలను తెచ్చింది. అలాగే, సముద్రాలపై మరింత అవగాహనతోపాటు వాటి అపార సామర్థ్యాన్ని బాధ్యతాయుతంగా వాడుకోవడానికీ మేం సముద్ర శాస్త్రం-అన్వేషణలో పెట్టుబడులు పెడుతున్నాము" అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

ప్రపంచంలో రెండో అతిపెద్ద సముద్రరంగ కార్మిక శక్తిగా భారతీయ నావికులను ఇప్పుడు పరిగణిస్తున్నారని, ఆ మేరకు భారత యువత అంతర్జాతీయ జలాల్లో గౌరవాన్ని సముపార్జిస్తున్నారని శ్రీ మోదీ అన్నారు. బలమైన సముద్రరంగ ఆర్థిక వ్యవస్థ రూపకల్పతోపాటు సముద్ర ఆరోగ్యాన్ని, తీరప్రాంత వ్యవస్థలను భారత్ పరిరక్షిస్తోందని ఆయన చెప్పారు. సహకారం, విశ్వాసం, పరస్పర గౌరవం, ("సముద్రాలు సమష్టి సౌభాగ్యానికి మూలం కావాలని, ప్రతి దేశానికి తన గళం వినిపించగల, పురోగమనం సాధించగల అవకాశం ఉండాలని మేం విశ్వసిస్తున్నాం" అని ప్రధాని మోదీ అన్నారు. సాగరమంథన్ ఆ దృక్పథాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో చర్చలు భావి తరంలో సరికొత్త ఆలోచనలు రేకెత్తించడమే కాకుండా పటిష్ఠ భాగస్వామ్యాలు, అపార అవకాశాలకు తోడ్పడగలవని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు.

# రామకృష్ణాపూర్‌లో గంజాయి పట్టివేత




ఆదిలాబాద్, అక్టోబర్ 9రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టుబడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై జాడి శ్రీధర్ తన సిబ్బందితో కలిసి రోజూవారీ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

గాంధారి మైసమ్మ ఆలయ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులను చూసి వారు భయాందోళనతో పారిపోయేందుకు యత్నించగా, అప్రమత్తమైన పోలీస్ సిబ్బంది వారిని వెంటాడి అదుపులోకి తీసుకున్నారు. నిందితులను తనిఖీ చేయగా, వారి వద్ద ఉన్న ఒక నల్లటి కవరులో 120 గ్రాముల గంజాయి లభ్యమైంది.

నిందితుల నుంచి గంజాయితో పాటు ఒక మోటార్ సైకిల్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో ఈ గంజాయిని బెల్లంపల్లి ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు నిందితులు అంగీకరించారని పోలీసులు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఎస్సై జాడి శ్రీధర్ మాట్లాడుతూ.. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. యువత భవిష్యత్తును నాశనం చేసే ఇటువంటి అక్రమ కార్యకలాపాలను సహించేది లేదు" అని హెచ్చరించారు.






# సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన..



ఆదిలాబాద్, అక్టోబర్ 9దస్తూరాబాద్ మండలనీలోని రాంపూర్, బూత్కూర్ గ్రామాల్లో సేంద్రీయ వ్యవసాయంపై ధనుకా కంపెనీ సైంటిస్ట్ శంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులపై రైతులకు వివరించారు.

రసాయనాల వాడకం తగ్గించి భూసారాన్ని పెంచుకోవాలని నిపుణుల పిలుపు మేరకు సదస్సుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన రాంపూర్, బూత్కూర్ గ్రామాల రైతులు తరలి వచ్చారు. దస్తురాబాద్ మండల కేంద్ర పరిధిలోని రాంపూర్, బూత్కూర్ గ్రామాలలో రైతన్నలకు సేంద్రీయ సాగుపై ధనుకా కంపెనీ ప్రతినిధులు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత రోజుల్లో విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడటం వల్ల సాగు ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని, అదే సమయంలో భూములు నిస్సారంగా మారుతున్నాయని కంపెనీ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో రైతులు తక్కువ పెట్టుబడితో.. ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో అధిక దిగుబడులు ఎలా సాధించవచ్చో క్షేత్రస్థాయిలో వివరించారు. పంట పొలాల్లోనే చార్టులు ప్రదర్శిస్తూ, మొక్కల పెరుగుదల దశలను చూపిస్తూ.. భూమిలో సేంద్రీయ కర్బనాన్ని (సారాన్ని) పెంచే ధనుకా కంపెనీ జీవ ఉత్పత్తుల గురించిన సమాచారాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు.

# ఐఐసీటీ, యూట్యూబ్ సహకారంతో నిర్వహిస్తోన్న 'క్రియేట్ విత్ ఏఐ'
## కార్యక్రమం కింద నాలుగు కృత్రిమ మేధస్సు ఆధారిత చిత్రాల ఆవిష్కరణ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 9:ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ), యూట్యూబ్ సంయుక్తంగా నిర్వహిస్తోన్న 'క్రియేట్ విత్ ఏఐ' కార్యక్రమం ఒక కీలక ఘట్టానికి చేరుకుంది. ఏఐ ఆధారిత సృజనాత్మక ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వడానికి, వర్ధమాన సాంకేతికతలో భారత్ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి 2025 నవంబర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రకటించారు. ఏఐ ఉపయోగించి తీసిన మొదటి నాలుగు లఘు చిత్రాలు ఇందులో భాగంగా తొలిసారిగా విడుదలయ్యాయి. ఏఐ నేతృత్వంలోని చలనచిత్ర నిర్మాణంలో భారత్‌ను ప్రపంచ నాయకుడిగా నిలబెట్టగల ఒక వ్యవస్థను తయారుచేయటంలో ఇదొక కీలక ఘట్టం.

నేడు ముంబయిలోని ఐఐసీటీ థియేటర్‌లో ఈ నాలుగు చిత్రాలను ఆవిష్కరించారు. అదే సమయంలో చిత్రనిర్మాతలు తమ యూట్యూబ్ ఛానళ్లలో కూడా వీటిని విడుదల చేశారు. చరిత్ర, పౌరాణికం, మానవ భావోద్వేగాలు, అంతరిక్ష అన్వేషణ వంటి విభిన్న అంశాలను, కథా చెప్పే విధానాలను ఈ చిత్రాలు తెలియజేస్తున్నాయి. ఏఐ ఆధారిత చలన చిత్ర నిర్మాణంలోని సృజనాత్మక సాధ్యాసాధ్యాలను ఇవి నిరూపిస్తున్నాయి.

1741 నాటి చారిత్రాత్మక కొలచెల్ యుద్ధం నేపథ్యంలో సాగే ఒక కల్పిత చలనచిత్ర కథే ఏవియం స్టూడియోస్ వారి 'చెకావర్'. ఆ కాలపు భూమి, ప్రజలు, ధైర్యసాహసాలు, యుద్ధ కళా సంప్రదాయాల నుంచి ఈ చిత్రం స్ఫూర్తి పొందింది.

తత్వవేత్త, వ్యూహకర్త, మౌర్య సామ్రాజ్య నిర్మాత అయిన చాణక్యుని గురించి తెలియని ప్రయాణాన్ని ఆవిష్కరించే చారిత్రక ఇతిహాసమే ఎలెవెన్ డోర్ స్టూడియో వారి 'చాణక్య – ది మైండ్ ఆఫ్ యాన్ ఎంపైర్' చిత్రం.

శక్తికి సంబంధించిన దైవిక అభివ్యక్తిని, విశ్వ సమతుల్యతను పునరుద్ధరించడానికి ఆమె చేసిన పురాణ పోరాటానికి సంబంధించినది కల్పనిక్ ఫిల్మ్స్ వారి 'దేవి: ది నైన్ ఆస్ట్రాస్' చిత్రం.

కార్తీక్ కుల్ క్రియేషన్స్ వారి 'లైకా' చిత్రం.. అంతరిక్ష యానం చేసిన ఒక కుక్క భావోద్వేగ ప్రయాణాన్ని చూపుతుంది. అంతరిక్ష అన్వేషణ నేపథ్యంలో ధైర్యం, త్యాగం, మానవులు-జంతువుల మధ్య ఉన్న బంధం వంటి అంశాలను ఇది అన్వేషిస్తుంది.

చిత్రరూపకర్త అనే వారు కథాంశానికి కేంద్ర బిందువుగానే ఉంటూ సృజనాత్మక సాధ్యతలను పెంచినప్పుడే ఏఐ అత్యంత శక్తిమంతంగా పనిచేస్తుందని ఈ చిత్రాలు నిరూపిస్తున్నాయి. గూగుల్, యూట్యూబ్ ఏఐ సాంకేతికతలు..ఐఐసీటీ మౌలిక సదుపాయాలు, అక్కడి అధ్యాపకుల మార్గదర్శకత్వం, చిత్రనిర్మాతల ఊహాశక్తిని ఒకచోట చేర్చడానికి 'క్రియేట్ విత్ ఏఐ' కార్యక్రమాన్ని ఒక ఆచరణాత్మక ప్రయోగంగా రూపకల్పన చేశారు.

ఈ సందర్భంగా ఐఐసీటీ సీఈఓ డాక్టర్ విశ్వాస్ డియోస్కర్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత చలనచిత్ర నిర్మాణంలో తదుపరి అధ్యాయానికి నాయకత్వం వహించే అవకాశం భారత్‌కు ఉందని అన్నారు. 'క్రియేట్ విత్ ఏఐ' కార్యక్రమం సంస్థాగత మార్గదర్శకత్వాన్ని, అధునాతన ఏఐ సాధనాలను ఒకచోట చేర్చుతోందని.. ఇది భారతీయ సృజనాత్మక స్టూడియోలకు ప్రయోగాలు చేయడానికి, సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి, కొత్త చలనచిత్ర నిర్మాణ విధానాలను అభివృద్ధి చేయడానికి అవకాశం కల్పిస్తోందని తెలిపారు. ఏఐ-ఆధారిత కథాకథనంలో దేశాన్ని ముందంజలో ఉంచగల ఒక వ్యవస్థను సృష్టించడంలో ఇదొక కీలకమైన అడుగు అని ఆయన అన్నారు.

క్రియేటర్లు జనరేటివ్ ఏఐని ఉపయోగించే అవకాశాలను ప్రధానంగా ప్రస్తావించిన యూట్యూబ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గుంజన్ సోని మాట్లాడుతూ.. భారత్ ఎప్పుడూ ఒక అసాధారణమైన కథాకథన దేశంగా ఉంటూ వచ్చిందని అన్నారు. అయితే ఇప్పుడు స్వతంత్ర క్రియేటర్లు తమ సొంత నిబంధనల ప్రకారం ప్రొడక్షన్ పవర్‌హౌస్‌లను నిర్మించుకోవడం మనం చూస్తున్నామని ఆమె అన్నారు. "నిర్భయమైన భారతీయ కథాకథనం, సరికొత్త సాంకేతికత ఒకచోట చేరి స్వతంత్ర స్థాయిలో ప్రపంచ స్థాయి సినిమాను తీసినప్పుడు ఎలాంటి అద్భుతాలు జరుగుతాయో మా ఐఐసీటీ భాగస్వామ్యం నిరూపిస్తుంది" అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీరిలో డైరెక్టర్ జనరల్ (పశ్చిమ ప్రాంతం) స్మితా వత్స్ శర్మ, ఐ-బీ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ సెంథిల్ రాజన్, ఎన్ఎఫ్‌డీసీ ఎండీ శ్రీ ప్రకాష్ మగ్దుమ్, సీబీఎఫ్‌సీ సీఈఓ శ్రీ రాజేంద్ర సింగ్ తదితరులు ఉన్నారు.

జనరేటివ్ ఏఐ ప్రొడక్షన్ పరమైన అవరోధాలను పూర్తిగా తొలగిస్తుంది. తద్వారా క్రియేటర్లు రచన, కథకథనం, తమ నైపుణ్యంపై దృష్టి పెట్టడానికి విలువైన సమయాన్ని ఇస్తుంది. పబ్లిక్ ఫస్ట్, గూగుల్ రూపొందించిన కొత్త 'జెన్ మీడియా ఇండియా' నివేదిక ప్రకారం జనరేటివ్ మీడియా సాధనాలు భారత్‌లోని సృజనాత్మక నిపుణులకు 20 శాతం ఉత్పాదకత పెరుగుదలను అందిస్తున్నాయి. దీని అర్థం ప్రతి సంవత్సరం సుమారు 390 గంటలు ఆదా అవుతాయి. ఇది సృష్టికర్తలు రచన, కథకథనం, తమ కళను మెరుగుపరుచుకోవడంపై పూర్తిగా దృష్టి పెట్టడానికి దాదాపు పది పూర్తి వారాల సమయాన్ని ఆదా చేస్తుంది.

భారతదేశపు యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఏవీజీసీ-ఎక్స్ఆర్) జాతీయ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఈ 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ)'. దీనిని కేంద్ర ప్రభుత్వ సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ, మహారాష్ట్ర ప్రభుత్వం, ఎఫ్ఐసీసీఐ, సీఐఐ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ఎన్ఎఫ్‌డీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన దీని మొదటి క్యాంపస్ 2025 జూలైలో కార్యకలాపాలు ప్రారంభించింది. అయితే గోరెగావ్‌లోని ఫిల్మ్ సిటీలో 10 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత క్యాంపస్ రూపుదిద్దుకుంటోంది. ఐఐసీటీ ప్రస్తుతం 18 కోర్సులను అందిస్తోంది. ప్రముఖ ప్రపంచ సాంకేతిక, మీడియా కంపెనీలతో భాగస్వామ్యాలను కలిగి ఉంది.

# ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి

**-రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి సుజాత సూచన**

ఆదిలాబాద్, అక్టోబర్ 9 తక్కువ వర్షపాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి సుజాత సూచించారు. గురువారం కుంటాల మండలంలోని కల్లూరు మన గ్రోమోర్, పెంచికల్‌పాడు, అంబకంటి గ్రామాల్లోని పలు ఎరువుల దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. రైతులకు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ఎరువులను విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని దుకాణదారులను ఆదేశించారు.

రైతులకు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు రాబోయే రబీ పంటలకు అవసరమైన విత్తనాలను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలని దుకాణదారులకు తెలిపారు. తక్కువ వర్షపాతంతో పండించే పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. అనపకాయ, మినుము, పొద్దుతిరుగుడు తదితర ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలను వివరించారు. వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షపాతం లేనందున అధిక నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విక్రమ్, ఎరువుల దుకాణాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# భవానీ దీక్ష చేపట్టిన కేంద్ర మంత్రి బండి సంజయ్

## 11 రోజులపాటు అమ్మవారి సేవలోనే..
## నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన మహాశక్తి ఆలయం



కరీంనగర్, అక్టోబర్ 9: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ భవానీ దీక్షను ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి అమ్మవారి ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాల మధ్య మాలాధారణ చేసి, ఎర్రని వస్త్రాలు ధరించి దీక్ష చేపట్టారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 11 రోజులపాటు దీక్షలో కొనసాగుతూ ఆలయంలోనే ఉండి అమ్మవారి సేవలో పాల్గొననున్నారు.

దీక్షా కాలంలో బండి సంజయ్ ఆలయంలోనే ఉంటూ అమ్మవారి సేవతోపాటు నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. వివిధ సమస్యలపై తనను కలిసేందుకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా టెంట్ ఏర్పాటు చేశారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

**నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు**

దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ మహాశక్తి అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రత్యేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 11 నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండగా, రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

భవానీ దీక్షాధారులు, భక్తుల రాకతో ఆలయం సందడిగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

**భక్తులకు అన్నప్రసాదం, వసతి సౌకర్యాలు**

నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులతోపాటు భవానీ దీక్షాధారులకు భోజనం, అల్పాహారం, పూజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులందరికీ ఉచితంగా ప్రసాదాలు అందించనున్నారు. ప్రతిరోజూ సుమారు 5 వేల నుంచి 10 వేల మంది భక్తులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేలా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా తగిన సౌకర్యాలు కల్పిస్తున్నారు.

కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయంలో 16 ఏళ్ల క్రితం అమ్మవారి ప్రతిష్ఠాపన జరిగింది. ప్రారంభంలో బండి సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులతోపాటు కొద్దిమంది భక్తులు మాత్రమే నవరాత్రుల సందర్భంగా భవానీ మాలాధారణ చేసి దీక్ష చేపట్టేవారు. క్రమంగా ఈ సంప్రదాయానికి ఆదరణ పెరిగి దీక్షాధారుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ముఖ్యంగా గత రెండేళ్లుగా దుర్గామాల ధరించే యువకుల సంఖ్య వేలల్లోకి చేరిందని నిర్వాహకులు చెబుతున్నారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఎరుపు రంగు వస్త్రాలు ధరించి భక్తులు దీక్షలు చేపడుతున్నారు. నవరాత్రి దీక్షతోపాటు మండల దీక్ష, దీర్ఘకాలిక దీక్షలు చేపట్టే భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి అమ్మవారి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతోంది.

# మంథనిలో బీఆర్ఎస్ భారీ రాస్తారోకో

## పుట్ట మధుకర్ నేతృత్వంలో నిరసన..
## విద్యుత్ సరఫరాపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు




కరీంనగర్, అక్టోబర్ 9:పెద్దపల్లి జిల్లా మంథని కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు గురువారం భారీ నిరసన కార్యక్రమం, రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల ఉచిత కరెంటు అందిస్తామని చెప్పి రైతులను నిండా ముంచిందని ఆరోపించారు. సరిపడా విద్యుత్ సరఫరా కాకపోవడంతో వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మంథని పాత పెట్రోల్ బంకు చౌరస్తాలో రోడ్డుపై వరి నారు, ఎండిన పంటలతో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'రైతు బతికితేనే రాష్ట్రం బతుకుతుంది.. రైతుకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

ఈ సందర్భంగా పుట్ట మధుకర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇచ్చామని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 3-4 గంటలు కూడా కరెంటు రావడం లేదని విమర్శించారు. వెంటనే వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనతో మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..
## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

కరీంనగర్, అక్టోబర్ 9: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన 100 రోజుల త్రివర్ణ పతాక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రతి విద్యా సంవత్సరంలో 100 రోజుల పాటు జాతీయ జెండాను ఆవిష్కరించే కార్యక్రమం అభినంద నీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించడంతో పాటు దేశం పట్ల గౌరవం, బాధ్యతను పెంచుతాయని తెలిపారు.

అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకోవాలని సూచించారు. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజానికి ఉపయోగపడే బాధ్యతగల పౌరులుగా ఎదగాలని ఎస్పీ సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గుర్తించాలని, వాటికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేసి మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలని కోరారు.

ప్రతి విద్యార్థి రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, మైనర్ల డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఇతరులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.

విద్యార్థులు సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. నకిలీ ఖాతాలు, మోసపూరిత లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఉపకార వేతనాలు, బహుమతులు, లక్కీడ్రాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. అపరిచిత లింకులను తెరవకుండా, అనుమానాస్పద సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాయికిరణ్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ రఘునందన్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపనకు పకడ్బందీ ఏర్పాట్లు

## భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగొద్దు : కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మం, అక్టోబర్ 9ఖమ్మం నగరంలోని అల్లిపురం- కొత్తగూడెం సమీపంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 12న నిర్వహించనున్న భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉండటంతో ఖమ్మం నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఆలయ నిర్మాణ స్థలం, భూమిపూజ ప్రాంగణం, వేదిక నిర్మాణ ప్రాంతం, భక్తుల కోసం కల్పించాల్సిన మౌలిక వసతులను పరిశీలించారు.

కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ అతిథులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంచినీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, వేదిక నిర్మాణం, షామియానాలు, మైక్ సిస్టమ్ తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ నిరంతరం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

శంకుస్థాపన కార్యక్రమానికి భక్తులతో పాటు పెద్ద సంఖ్యలో వాహనాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ ప్రాంగణానికి వచ్చే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ అల్లిపురం రహదారితో పాటు నగర పరిధిలో ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా అవసరమైన చోట్ల మార్గదర్శకాలు, నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

శంకుస్థాపన మహోత్సవం ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చే కార్యక్రమంగా నిలిచేలా ఏర్పాట్లు ఉండాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు.

నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, పార్కింగ్, ట్రాఫిక్ తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అవసరమైన ఏర్పాట్లను నిర్ణీత సమయానికి పూర్తి చేసి, కార్యక్రమం రోజున అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. కమిషనర్ పర్యటనలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, కార్పొరేషన్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ ఆర్టీసీ డిపోలో పోలింగ్ సందడి..

నల్గొండ, అక్టోబర్ 9: కోదాడ ఆర్టీసీ డిపో యూనియన్ల ఎన్నికల పోలింగ్ శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచే ఉత్సాహంగా ప్రారంభమైంది. డిపో పరిధిలో మొత్తం 261 మంది ఓటర్లు ఉన్నారని సంఘాల నాయకులు తెలిపారు. పోటీలో ఉన్న టీ ఎం యు, టి డబ్ల్యూ ఎఫ్, టి డబ్ల్యూ యు, ఎస్ ఈ డబ్ల్యూ ఎఫ్ సంఘాలు శిబిరాలు ఏర్పాటు చేసి ప్రచారం ముమ్మరం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు డిపో వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# పౌరుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ద్వారా... 'వికసిత్ భారత్' మంత్రంతో 2047 నాటికి అన్ని రంగాల్లోనూ దేశాన్ని అగ్రగామిగా నిలపాలనే సంకల్పాన్ని ప్రేరేపించిన శ్రీ మోదీ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 9:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'సేవ, సమర్పణ'లో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

'ఎక్స్' వేదికగా చేసిన వరుస పోస్టుల్లో కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు... "అలుపెరుగని కృషి, అద్భుతమైన సంకల్పం, దేశానికి ప్రథమ ప్రాధాన్యం అనే మార్గదర్శక సూత్రంతో కూడిన 'సేవ, సమర్పణ'లో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రఖ్యాత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీజీకి హృదయపూర్వక అభినందనలు. సరిగ్గా ఇదే రోజున అంటే అక్టోబర్ 7, 2001న మోదీజీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ఆయన పదవీకాలంలో కొనస్సాగిన నిరంతర ప్రయాణం... పేదల సంక్షేమం, మహిళా సాధికారత, యువత అభ్యున్నతి, సమాజంలోని ప్రతి వర్గం శ్రేయస్సులో ప్రతిబింబిస్తుంది. ఈ 25 ఏళ్ల పాలనలో మోదీజీ ప్రజా సంక్షేమ విధానాలు, వాటి సమర్థమైన అమలు, నిర్ణయాత్మక నాయకత్వం, పారదర్శకత, ఫలితాల నిశ్చయతతో కూడిన పరిపాలనను పునర్నిర్వచించారు. తద్వారా 'పనితీరు ఆధారిత రాజకీయాల' ఆదర్శాన్ని నెలకొల్పారు."

శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు... "ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, భూకంపం వల్ల ధ్వంసమైన కచ్ ప్రాంతాన్ని మోదీజీ ఆదర్శవంతమైన ప్రాంతంగా పునర్నిర్మించారు. 'జ్యోతి గ్రామ్ యోజన' ద్వారా ప్రతి గ్రామానికి 24 గంటల విద్యుత్ అందేలా చేశారు. సౌరశక్తి, 'వైబ్రంట్ గుజరాత్' కార్యక్రమాల ద్వారా పెట్టుబడులు, పరిశ్రమలకు కొత్త దిశానిర్దేశం చేశారు. 8 శాతానికి పైగా వ్యవసాయ వృద్ధి రేటును సాధించి, గుజరాత్‌లో సుపరిపాలన నమూనాను నెలకొల్పారు. ఇది తరువాతి కాలంలో దేశం మొత్తానికి పునాదిగా నిలిచింది. ఆయన ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో ఈ దార్శనికత మరింత విస్తరించింది. అంతరిక్షం నుంచి సముద్రాల వరకు... అంతర్జాతీయ వేదికల నుంచి అంతర్గత భద్రత వరకు... అనేక రంగాల్లో భారత్ కొత్త మైలురాళ్లను సాధించింది. ప్రజల జీవితాల్లోనూ గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. కోట్లాది కుటుంబాలకు శాశ్వత గృహవసతి, రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా రక్షణ, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీటి సౌకర్యం లభించాయి."

"నేడు మోదీజీ నాయకత్వంలో... తయారీ, డిజిటల్ చెల్లింపులు, అంకురసంస్థలు, సెమీకండక్టర్లు, రక్షణ ఉత్పత్తి, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో కొత్త శిఖరాలను అధిరోహిస్తూ భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా దూసుకెళ్తోంది. యుద్ధం, అస్థిరతలు నెలకొన్న ఈ కాలంలో... శాంతి, సామరస్యాల కోసం భారత్ అంతర్జాతీయ వేదికపై అవిశ్రాంతంగా కృషి చేస్తోంది. కోట్లాది పౌరుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడం ద్వారా, 'వికసిత్ భారత్' మంత్రాన్ని మోదీజీ అందించారు. 2047 నాటికి దేశాన్ని ప్రతి రంగంలోనూ అగ్రగామిగా నిలపాలనే సంకల్పాన్ని పౌరుల్లో ప్రేరేపించారు. ఆయన నాయకత్వంలో మేమంతా ఈ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం మా అందరికీ గర్వకారణం, మా అదృష్టం" అని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

## జుక్కల్‌లో మహిళా సంఘ భవన నిర్మాణ పనులకు భూమిపూజ



నిజామాబాద్, అక్టోబర్ 9: మహిళల ఆర్థిక అభివృద్ధిని కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం జుక్కల్ మండలంలోని పెద్ద గుల్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ మాధవరావు దేశాయ్‌తో కలిసి రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు.

గత ప్రభుత్వాలు మహిళల గురించి, వారి ఆర్థిక పరిస్థితి, సంక్షేమ పథకాల గురించి పట్టించుకోలేదని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, వారి ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు సబ్సిడీ సిలిండర్ల పంపిణీ, గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ఐకేపీ ద్వారా మహిళా సంఘాలకు ఆర్థికంగా ఎదిగేందుకు రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, ఐకేపీ ఉద్యోగులు, కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ జె.పి. నడ్డా నేతృత్వంలో భారత్ మండపంలో 'జోష్' బృందాల జాతీయ స్థాయి ప్రారంభ కార్యక్రమం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 9:యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, రక్షణ మంత్రిత్వశాఖల సహకారంతో 2026 అక్టోబరు 8న న్యూఢిల్లీలోని భారత్ మండపం వేదికగా 'జోష్' (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్) బృందాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ప్రారంభించనుంది. తొలి విడతలో 11 రాష్ట్రాల్లోని 55 జిల్లాల్లో ఈ జోష్ బృందాలను రంగంలోకి దించనున్నారు. యువత ఆధ్వర్యంలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం, టీబీ ముక్త్ భారత్ సందేశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. దేశంలో క్షయవ్యాధి (టీబీ) నిర్మూలన దిశగా సాగుతున్న పోరాటంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఇదొక ముఖ్యమైన ముందడుగు.

కేంద్ర కార్మిక, ఉపాధి - యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ, రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్, ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్త సమక్షంలో.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ - రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా ఈ జోష్ బృందాల జాతీయ స్థాయి ప్రారంభోత్సవానికి నేతృత్వం వహిస్తారు. భాగస్వామ్య మంత్రిత్వ శాఖల సీనియర్ అధికారులు, ప్రజాప్రతినిధులు, క్లాస్-ఎ అధికారులు, మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్‌సీసీ కేడెట్లు, దేశ టీబీ నిర్మూలన కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఈ కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ సాధించిన కీలక విజయాలను వివరిస్తూ రూపొందించిన వీడియో ప్రదర్శన ఉంటుంది. అనంతరం జోష్ బృందాలను అధికారికంగా ప్రారంభిస్తారు. దీనితోపాటు టీబీ ముక్త్ భారత్ అభియాన్‌కు సంబంధించిన కొత్త సమాచారం, విద్య, ప్రచార సాధనాలనూ ఆవిష్కరిస్తారు. అంతేకాకుండా ప్రజల్లో అవగాహనను పెంపొందించడం, సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, టీబీ నిర్మూలన జాతీయ లక్ష్య సాధనలో సమాజ క్రియాశీల పాత్రను పెంచడం ధ్యేయంగా.. ఏఐ ఆధారిత చాట్‌బాట్ 'ఖుషి అవతార్'ను కూడా ఆవిష్కరిస్తారు.

దేశ యువత ఉత్సాహాన్నీ, వారి విస్తృత పరిధినీ టీబీ నిర్మూలన దిశగా ఒక వ్యవస్థీకృత ప్రజా ఉద్యమంగా మలిచేందుకు ఒక నిర్మాణాత్మక యంత్రాంగంగా 'జోష్' బృందాలను రూపుదిద్దారు. పాలనపరమైన నాయకత్వాన్నీ, మై భారత్, ఎన్‌సీసీ వ్యవస్థల విస్తృత యువజన నెట్‌వర్క్, సామాజిక భాగస్వామ్య సామర్థ్యాలనూ మేళవిస్తూ... క్లాస్-ఎ అధికారులు, మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్‌సీసీ కేడెట్లను ఈ బృందాలు ఏకతాటిపైకి తెస్తాయి.

మొదటి దశలో ఈ కార్యక్రమం బ్లాక్/వార్డు, కమ్యూనిటీ స్థాయుల్లో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తుంది. తద్వారా టీబీ ముక్త్ భారత్ సందేశాన్ని ఆరోగ్య కేంద్రాలకే పరిమితం చేయకుండా.. జనావాసాలకు, పని ప్రదేశాలకు, ప్రజల కూడళ్లకు మరింత చేరువ చేస్తుంది.

సామాజిక అవగాహన కార్యక్రమాలు, సమాజ భాగస్వామ్యం ద్వారా.. టీబీ లక్షణాలు, నివారణ, సకాలంలో రోగనిర్ధారణ, చికిత్సను పూర్తి చేయడంపై కీలక సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయడంలో జోష్ బృందాలు తోడ్పాటునందిస్తాయి. అలాగే టీబీపై అపోహలను తొలగించడం, టీబీ బాధితులపై సామాజిక వివక్షను తగ్గించడం, దేశవ్యాప్త టీబీ నిర్మూలన ఉద్యమంలో వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సమాజపరంగా ప్రతి ఒక్కరూ క్రియాశీలంగా పాల్గొనేలా ప్రోత్సహించడంలో ఇవి విశేష పాత్ర పోషిస్తాయి.

టీబీ నిర్మూలన పోరాటంలో యువతను భాగస్వాములను చేయడం, అవగాహన పెంపొందించడం, సామాజిక చైతన్యాన్ని తీసుకురావడం, సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించడం కోసం వారికి ఒక స్పష్టమైన వేదికను కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యం. క్లాస్-ఎ అధికారులు, మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్‌సీసీ కేడెట్ల మధ్య సమన్వయం.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలతో మరింత బలంగా అనుసంధానించడానికి ఎంతగానో తోడ్పడుతుంది.

జన భాగీదారీని దేశ టీబీ నిర్మూలన చర్యలకు మౌలిక ప్రాతిపదికగా జోష్ నిలుపుతోంది. 2025లో.. 697 జిల్లాల్లోని 67,933 పంచాయతీలు టీబీ రహిత గ్రామాలుగా గుర్తింపును పొందాయి. దేశ టీబీ నిర్మూలన లక్ష్య సాధనలో ఆరోగ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు, సమాజ భాగస్వామ్యంతో కూడిన సమష్టి కృషికి ఇది నిదర్శనం.

టీబీ నిర్మూలన సందేశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో.. స్థానిక నాయకత్వం, సామాజిక నేతృత్వం, నిరంతర భాగస్వామ్యాల ఆవశ్యకతను ఇది చాటుతోంది. క్షయవ్యాధి నివారణ చర్యలపై అవగాహన, ఆ దిశగా సామాజిక సమీకరణ, భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా.. యువత శక్తి, విస్తృత ప్రచారం, సామాజిక వ్యవస్థల సద్వినియోగం ద్వారా ఈ జన భాగిదారీ స్ఫూర్తిని జోష్ బృందాలు మరింత ముందుకు తీసుకెళ్తాయి.

ఆరోగ్య, యువజన, రక్షణ రంగాల సంస్థాగత బలాలు, సామాజిక ప్రచార వ్యవస్థలను ఏకతాటిపైకి తేవడం ద్వారా.. ఏకోన్ముఖ ప్రభుత్వ, సామాజిక సమగ్రతా విధానానికి జోష్ బృందాలు ప్రతినిధులుగా నిలుస్తాయి.

ప్రజారోగ్య విధానాన్ని, టీబీ నిర్మూలన కార్యాచరణను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమంలో వివరిస్తుంది. కాగా మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్‌సీసీ కేడెట్ల ప్రాతినిధ్యానికి మార్గం సుగమం చేస్తూ... క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించడంలోనూ, అవగాహన ప్రచారంలోనూ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, రక్షణ మంత్రిత్వశాఖలు ముఖ్యభూమిక పోషిస్తున్నాయి.

ప్రభుత్వం ఎప్పటికప్పుడు వివిధ మంత్రిత్వ శాఖలు, రంగాల మధ్య సమన్వయానికి ఇస్తున్న ప్రాధాన్యానికి ఈ కార్యక్రమం నిదర్శనం. విభిన్న సంస్థాగత, సామాజిక వ్యవస్థలు కలిసి ఒక ఉమ్మడి జాతీయ లక్ష్యానికి దోహదపడేలా ఇది వీలు కల్పిస్తుంది. ప్రజలే కేంద్రంగా ఉన్న, ప్రాతినిధ్య, సామాజిక టీబీ నిర్మూలన కార్యక్రమాల దిశగా ప్రభుత్వ చర్యల్లో 'జోష్' బృందాలు మరో కీలకమైన ముందడుగు. మంత్రులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఆరోగ్య కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, యువత, ప్రజలందరి సమష్టి కార్యాచరణే ఇందుకు ప్రాతిపదిక. క్షేత్రస్థాయిలో బలమైన భాగస్వామ్యం, క్రియాశీల జనభాగిదారీ ద్వారా... టీబీ ముక్త్ భారత్ నిర్మాణం దిశగా సమష్టి సంకల్పాన్ని జోష్ బృందాలు మరింత బలోపేతం చేస్తాయి.

# 'ఆర్ఐఎన్ఎల్' భూమి ఇ-వేలం ప్రక్రియకు ముందు నమూనా ఇ-వేలం ద్వారా 'ఎన్ఎల్ఎంసీ' అవగాహన

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 9:విశాఖపట్నం ఉక్కు కర్మాగారం కార్పొరేట్ సంస్థ 'రాష్ట్రీయ ఇస్పత్ నిగమ్ లిమిటెడ్' (ఆర్ఐఎన్ఎల్) పరిధిలోని భూమిలో 93,572.21 చదరపు గజాల విస్తీర్ణం గల 459 ప్లాట్లను ఆన్‌లైన్ ద్వారా (ఇ-వేలం) విక్రయించనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్ బిడ్డింగ్‌పై అవగాహన కల్పించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలోని ప్రభుత్వరంగ సంస్థల విభాగం (డీపీఈ) ఆధ్వర్యంగల జాతీయ భూ ద్రవ్యీకరణ సంస్థ (ఎన్ఎల్ఎంసీ) 2026 అక్టోబరు 6న విశాఖపట్నంలో ఒక నమూనా ఇ-వేలం వేదిక ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించింది.

అక్టోబరు 12, 16 తేదీలలో నిర్వహించే ఇ-వేలంలో పాల్గొనబోయే వారు (బిడ్డర్లు) సహా ఆసక్తిగల భాగస్వామ్య సంస్థలకు దీనిపై అనుభవపూర్వక అవగాహన దిశగా విశాఖపట్నంలోని ఫెయిర్‌ఫీల్డ్‌లో మారియట్ సంస్థ అక్టోబరు 6న ఈ ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా "బిడ్డింగ్ స్వరూపం, పాల్గొనే విధానం, ఆన్‌లైన్ వేలం ప్రక్రియలోని ఇతర కీలకాంశాలను నిపుణులు వివరించారు. తద్వారా ప్రత్యక్ష వేలానికి ముందు బిడ్డర్లకు దీనిపై ఆచరణాత్మక అవగాహన కలిగింది.

ఈ శిక్షణకు హాజరు కాలేకపోయిన వారి సౌలభ్యం కోసం అక్టోబరు 7న 'ఎన్ఎల్ఎంసీ' ఆన్‌లైన్ నమూనా ఇ-వేలం కార్యక్రమం కూడా నిర్వహించింది. రెండు దశలలో (12, 16) ప్రత్యక్ష వేలం నిర్వహించడానికి ముందు ఏర్పాటు చేసిన ఈ నమూనా వేలం డిజిటల్ బిడ్డింగ్ ప్రక్రియ గురించి తెలుసుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ నేపథ్యంలో తొలి దశ ఇ-వేలం ప్రక్రియను అక్టోబరు 12న ఉదయం 11:00 నుంచి రాత్రి 7:00 గంటల దాకా నిర్వహిస్తుంది. అటుపైన రెండో దశలో అక్టోబరు 16న కూడా ఉదయం 11:00 నుంచి రాత్రి 7:00 గంటల వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

ఈ సందర్భంగా 'ఎన్ఎలఎంసీ' ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈఓ) శ్రీ రోహన్ చంద్ ఠాకూర్ మాట్లాడుతూ- "ప్రత్యక్ష వేలంపాటకు ముందు బిడ్డర్లకు డిజిటల్ బిడ్డింగ్ ప్రక్రియను పరిచయం చేయడం ఈ నమూనా వేలం ఉద్దేశం. తదనుగుణంగా వారు ఈ వేదిక గురించి అవగాహన పొంది, నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా లాంఛనాలను పూర్తి చేసేందుకు ఈ కార్యక్రమం వీలు కల్పిస్తుంది. వేలం ప్రక్రియను పారదర్శకంగా, సౌలభ్యంతో, బిడ్డర్లకు సానుకూలమైన రీతిలో నిర్వహించడమే దీని ధ్యేయం. 'ఆర్ఎన్ఐఎల్' ఆస్తుల ద్రవ్యీకరణ దిశగా ఈ భూమి వేలం ఓ కీలక అవకాశం కల్పిస్తుంది. ఈ ప్రక్రియను వృత్తిగత నిపుణతతో, పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు 'ఎన్ఎల్ఎంసీ' కట్టుబడి ఉంది" అని తెలిపారు.

'ఆర్ఐఎన్ఎల్' భూఆస్తులలో విశాఖపట్నంలోని హెచ్‌బి కాలనీ, మద్దిలపాలెం, ఆటో నగర్, గాజువాక వంటి ప్రాంతాలలో 93,572.21 చదరపు గజాల విస్తీర్ణంలో 459 విలువైన, ఎలాంటి అడ్డంకులకూ తావులని ప్లాట్లు ఉన్నాయి. గుర్తించిన ప్రదేశాలలో సుమారు 128.94 చదరపు గజాల నుంచి 2,728 చదరపు గజాల వరకూ వివిధ పరిమాణాల్లో ఈ ప్లాట్లను వేలం వేస్తారు. తద్వారా కొనుగోలుదారులు తమకు అనువైన ప్లాటును ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ఈ మేరకు "రైల్‌టెల్ పరిధిలోని ఇ-నివిడా ఇ-ప్రొక్యూర్‌మెంట్ వేదిక ద్వారా పారదర్శక, ఎ ో ట త త వ ఇ-టెండర్-కమ్-ఇ-వేలం ప్రక్రియ ద్వారా ఈ ఆస్తుల విక్రయం సాగుతుంది.

# ప్రత్యేక న్యాయస్థానంలో టైపిస్టు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం :: జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ములుగు, అక్టోబర్ 9:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లాలో అత్యాచార, పోక్సో చట్టం కేసుల సత్వర విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానంలో ఒప్పంద ప్రాతిపదికన ఒక టైపిస్టు పోస్టును భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ పోస్టుకు నెలకు రూ.19,500 సమీకృత వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ, తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సాంకేతిక పరీక్షల్లో ఆంగ్ల టైపురైటింగ్ ఉన్నత శ్రేణి పరీక్ష, దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. కంప్యూటర్ నిర్వహణలో పరిజ్ఞానం, అర్హత కలిగి ఉండాలని తెలిపారు.

అభ్యర్థులు 01.10.2026 నాటికి 18 సంవత్సరాలు నిండి, 34 సంవత్సరాలు నిండని వారై ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుందని తెలిపారు.

టైపింగ్ నైపుణ్య పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20 కంటే ఎక్కువ దరఖాస్తులు అందితే నిబంధనల ప్రకారం అర్హత పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి ఇంటర్వ్యూలకు పిలవనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, సాంకేతిక అర్హతలు, పుట్టిన తేదీ, వర్తించే సామాజిక వర్గ ధ్రువపత్రం, స్థానికతకు సంబంధించిన ధ్రువపత్రాల ధ్రువీకరించిన ప్రతులను జతచేయాలని సూచించారు. అభ్యర్థి చిరునామా రాసిన కవరును రూ.25 విలువైన తపాలా బిళ్లలతో, తపాలా శాఖ నిర్దేశించిన రిజిస్టర్డ్ పోస్టు రుసుముకు అనుగుణంగా జతపరచాలని పేర్కొన్నారు.

పూర్తిచేసిన దరఖాస్తులను మూసివేసిన కవరులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా ప్రధాన న్యాయస్థానం, ములుగు చిరునామాకు స్పీడ్ పోస్టు, కొరియర్ ద్వారా పంపించాలని తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 22న సాయంత్రం 5 గంటల్లోగా కార్యాలయానికి చేరాలని స్పష్టం చేశారు. నేరుగా, వ్యక్తిగతంగా దరఖాస్తులు స్వీకరించబోమని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్నవి, గడువు తర్వాత అందిన దరఖాస్తులు తిరస్కరిస్తామని తెలిపారు.

పూర్తి నోటిఫికేషన్ వివరాలను "https://districts.ecourts.gov.in/mulugu" వెబ్‌సైట్‌లో పరిశీలించాలని ఆమె ప్రకటలో తెలిపారు.

# టెక్నాలజీ రాకతో తన విధులను పునర్-నిర్వచించుకుంటున్న పోస్టల్ విభాగం

## - లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, సామాజిక కార్యకర్త



హైదరాబాద్, అక్టోబర్ 9:డిజిటల్ టెక్నాలజీ విప్లవం, ప్రైవేటు కొరియర్ కంపెనీల రాకతో దేశవ్యాప్తంగా పోస్టల్ విభాగాలు తమ సేవలను పునర్-నిర్వచించుకోవలసిన అగత్యం ఏర్పడిందని ప్రముఖ సామాజిక కార్యకర్త, రచయిత, వక్త లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు స్థానిక టవర్ సర్కిల్ జనరల్ పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలో ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ 1837లో భారత పోస్టల్ సేవల పితామహుడు లార్డ్ డల్‌హౌజీ నాయకత్వంలో ప్రారంభమైన పోస్టల్ సేవలు క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించి నిశ్శబ్ద, నిస్వార్థ సేవలను మారుమూల ప్రాంతాలకు సహితం విస్తరించి, పలు రకాలైన సదుపాయాలను పౌర సమాజానికి అనదించడం హర్షణీయం అని అన్నారు. దేశవ్యాప్తంగా అమూల్యమైన పోస్టల్ సేవలను చేస్తున్న 1.65 లక్షల మంది ఉద్యోగులకు పౌర సమాజం పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కె. సైది రెడ్డి మాట్లాడుతూ తపాలా విభాగం పని ఒత్తిడిని తట్టుకుంటూ తమ సేవలను ఖచ్చితత్వంతో చేస్తున్నాయని, మా విభాగం సేవలను గుర్తించి సన్మానించిన శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్ సూపరింటెండెంట్ కె సైది రెడ్డి, పోస్ట్ మాస్టర్ తిరుపతిలను శావాహన లయన్స్ క్లబ్ బాధ్యులు ఘనంగా సన్మానించి ప్రపంచ తపాలా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లయన్ మర్రిపల్లి మహేందర్, లయన్ నార్ల వేణుగోపాల్, లయన్ ఇనుగుర్తి రమేష్, లయన్ డి తిరుపతి రెడ్డి, లయన్ పచ్చునూరి సురేందర్, లయన్ అనసూరి శ్రీనివాస్‌లతో పాటు 50 మంది తపాలా సిబ్బంది పాల్గొన్నారు

# నిర్ణీత గడువులోగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

## విద్యార్థుల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనపై ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష



వరంగల్, అక్టోబర్ 9:: జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, మెడికల్ కళాశాల విద్యార్థి నాయకులతో సమావేశం నిర్వహించారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పురోగతి, విద్యార్థుల సమస్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు.

జగిత్యాల మెడికల్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ శాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాలలో ఇంకా పూర్తికావాల్సిన నిర్మాణ పనులను గుర్తించి, వాటిని వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా తరగతి గదులు, ఇతర అవసరమైన వసతులను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించాలని తెలిపారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ పనులన్నింటినీ విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్, విద్యార్థి నాయకులకు హామీ ఇచ్చారు. పనుల పూర్తిలో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మెడికల్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ కొనసాగించనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో పి. మధుసూదన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# కూదవెల్లి ఆలయంలో శమీ మొక్కల పంపిణీ

**జమ్మిచెట్ల సంరక్షణే లక్ష్యంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్**
**జమ్మి మొక్కలు నాటిన సంతోష్‌కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి**
**పచ్చదనం పెంపే లక్ష్యంగా హరిత కార్యక్రమం**
**సంప్రదాయ వృక్ష పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ**
**గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో ఆరో ఏడాది హరిత కార్యక్రమానికి శ్రీకారం**
**కూదవెల్లి రామలింగేశ్వర స్వామి ఆలయంలో శమీ మొక్కల పంపిణీ.. నాటిన మాజీ ఎంపీ సంతోష్‌కుమార్**
**పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు**




సిద్దిపేట, అక్టోబర్ 9: తెలంగాణ రాష్ట్ర వృక్షమైన జమ్మిచెట్టు సంరక్షణతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మరో ముందడుగు వేసింది. మాజీ ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కొనసాగ ుతున్న 'ఊరికో జమ్మిచెట్టు.. గుడికో జమ్మిచెట్టు' కార్యక్రమం ఆరో ఏడాదిలోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం కూదవెల్లి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం లో శమీ మొక్కల పంపిణీ, నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరి ంచి, జమ్మి మొక్కలు నాటారు.

దేశవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంపొందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 2018లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రారంభమైంది. అప్పటి నుంచి మొక్కలు నాటడ ం, వాటి సంరక్షణలో ప్రజలను భాగస్వాములను చేయడం వంటి కార్యక్రమాలతో ఈ ఉద్యమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా చేపట్టిన 'ఊరికో జమ్మిచెట్టు.. గుడికో జమ్మిచెట్టు' కార్యక్రమం తెలంగాణ సంప్రదాయ వృక్షమైన జమ్మిచెట్టు ప్రాధాన్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తోంది.

తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక జీవితంలో జమ్మిచెట్టుకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా విజయదశమి సందర్భంగా జమ్మి ఆకులను బంగారంగా భావించి పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో, ప్రతి ఆలయంలో జమ్మిచెట్టు ఉండేలా ప్రోత్సహించడం ద్వారా సంప్రదాయాన్ని కాపాడటంతోపాటు పచ్చదనాన్ని పెంపొందించవచ్చనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, అవి పెరిగి వృక్షాలుగా మారే వరకు సంరక్షించడం కూడా అంతే అవసరం.

ఈ దిశగా ప్రజలు, యువత, గ్రామస్థులు మొక్కల పెంపకంలో చురుగ్గా పాల్గొనాలని నిర్వాహకులు సూచిస్తు న్నారు. జమ్మి మొక్కలను ఆలయాలు, గ్రామాల్లో నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపదను అందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావచ్చనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందిస్తోంది.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. జమ్మిచెట్ల సంరక్షణ, హరిత వాతావరణం పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో ఏసీబీ సోదాలు..

**ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు..**
**ఖమ్మం సహా ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు**

వరంగల్, అక్టోబర్ 9: ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యం లో మహబూబాబాద్ జిల్లా పౌరస రఫరాల సంస్థ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. జిల్లా పౌరసం ఫరాల శాఖ మేనేజర్ వాసంశెట్టి నరసింహారావు కార్యాలయంలోని క్యాబిన్‌లో అధికారులు పలు ఫైళ్లను పరిశీలిస్తున్నారు. ఇదే సమయంలో ఖమ్మంలోని ఆయన నివాసంలోనూ తనిఖీలు కొనసాగుతున్నట్లు సమాచారం.

నరసింహారావుకు సంబంధించినట్లు భావిస్తున్న మొత్తం ఏడు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట, హైదరాబాద్ ప్రాంతాల్లో ఆయనకు సంబంధించిన ఇళ్లు, ఇతర ఆస్తులతో పాటు బినామీలుగా అనుమానిస్తున్న వ్యక్తుల నివాసాల్లోనూ సోదాలు కొనసాగుతున్నట్లు సమాచారం.

ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ అధికారులు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. సోదాల్లో లభించే పత్రాలు, ఆస్తులకు సంబంధించిన వివరాలు, ఆర్థిక లావాదేవీలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

మహబూబాబాద్ కలెక్టరేట్ లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో నరసింహారావు క్యాబిన్‌లో ఫైళ్లను ఏసీబీ బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. సోదాలు పూర్తయిన తర్వాత అధికారులు స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల విలువకు సంబంధించిన వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

# మాదక ద్రవ్యాలపై అవగాహన, అభివృద్ధి కోసం కుల్లూ జిల్లాలోని మలానాలో కేంద్ర నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో జన సంవాద్ నిర్వహణ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 9:కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని రెవెన్యూ శాఖకు చెందిన కేంద్ర నార్కోటిక్స్ బ్యూరో (సీబీఎన్).. హిమాచల్ ప్రదేశ్‌లోని కుల్లూ జిల్లాలో మలానా గ్రామంలో 2026 అక్టోబర్ 6న 'జన సంవాద్' కార్యక్రమాన్ని నిర్వహించింది. 'యువ రక్ష' కార్యక్రమాల్లో భాగంగా మాదక ద్రవ్యాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2012 నాటి భారత జాతీయ మాదకద్రవ్యాలు, మానసిక ప్రభావిత పదార్థాల (ఎన్‌డీపీఎస్) విధానం, నార్కోటిక్స్ నియంత్రణ విజన్ డాక్యుమెంట్ 2026?2029కు అనుగుణంగా అక్రమ గంజాయి సాగు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ప్రత్యామ్నాయ జీవనోపాధిని ప్రోత్సహించే సీబీఎన్ లక్ష్యాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'నషా ముక్త్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నిరంతర మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించడం, యువతను భాగస్వామ్యం చేయడం, సమాజ భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా 'నషా ముక్త్ భారత్ అభియాన్' లక్ష్యాలకు తోడ్పడటం దీని ఉద్దేశం.

మలానా గ్రామం తన ప్రత్యేకమైన సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయ సామాజిక వ్యవస్థలకు ప్రసిద్ధి చెందింది. అలాగే అక్రమంగా గంజాయి సాగు జరిగే ప్రాంతాలతో ఈ గ్రామానికి చాలాకాలంగా సంబంధం ఉంది. 'జన సంవాద్' కార్యక్రమంలో భాగంగా కేంద్ర నార్కోటిక్స్ బ్యూరో (సీబీఎన్) గ్రామీణ యువత, ప్రజలకు గంజాయి, చరస్, హషీష్ ఆయిల్ వినియోగం వల్ల కలిగే హానిపై అవగాహన కల్పించింది. గ్రామస్థులు ప్రత్యామ్నాయ పంటలు, అభివృద్ధి కార్యక్రమాలు, స్థిరమైన జీవనోపాధి మార్గాలను ఎంచుకునేలా ప్రోత్సహించింది. ఇందుకు వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న సహాయాన్ని కూడా వివరించింది.

ప్రత్యామ్నాయ జీవనోపాధిని అభివృద్ధి చేసుకోవడంలో గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా చర్చించారు. ముఖ్యంగా ఆపిల్ సాగులో ఇబ్బందులు, రవాణా, అనుసంధాన సమస్యలు, మార్కెట్‌కు చేరుకోవడంలో ఇబ్బందులు, వ్యవసాయ ఉత్పత్తులకు సరైన ధరలు లభించకపోవడం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. అలాగే తేనెటీగల పెంపకం, పశుపోషణ, పాల ఉత్పత్తి, పర్యాటకం వంటి స్థానికంగా అనుకూలమైన ఇతర జీవనోపాధి అవకాశాలపై కూడా చర్చించారు. అక్రమ గంజాయి సాగు వల్ల స్థానిక పర్యావరణంపై పడుతున్న ప్రభావాన్ని కూడా ప్రస్తావించారు. ముఖ్యంగా గొర్రెలు, మేకలు మేపేందుకు సంప్రదాయంగా అందుబాటులో ఉన్న మేత ప్రాంతాలు తగ్గిపోవడం, అడవుల నరికివేతకు సంబంధించిన ఆందోళనలపై చర్చ జరిగింది.

ఈ సమావేశం నిర్మాణాత్మకంగా సాగింది. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను, స్థిరమైన అభివృద్ధి, ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించేందుకు ఉన్న అవకాశాలను సీబీఎన్ బృందం, స్థానిక ప్రజలు కలిసి చర్చించేందుకు ఈ కార్యక్రమం ఒక అవకాశాన్ని కల్పించింది.

జన్ సంవాద్ ముగింపులో రాబోయే పంట కాలంలో గంజాయి అక్రమ సాగును తొలగించాలని, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని స్థానిక ప్రజలు కలసికట్టుగా ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర నార్కోటిక్స్ బ్యూరో భాగస్వామ్యంతో ప్రత్యామ్నాయ జీవనోపాధి, ఇతర లాభదాయక పంటల సాగు అవకాశాలను అన్వేషించేందుకు అంగీకరించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని పాఠశాల విద్యార్థులు కూడా ప్రతిజ్ఞ చేశారు.

అక్రమ సాగును అరికట్టేందుకు కేవలం చట్టపరమైన చర్యలకే పరిమితం కాకుండా, నివారణ అవగాహన, ప్రజల భాగస్వామ్యం, ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలను ప్రోత్సహించడంలో సీబీఎన్ చూపుతున్న నిరంతర నిబద్ధతకు ఈ జన్ సంవాద్ నిదర్శనంగా నిలిచింది.

# లండన్‌లో 'భారత్ - బ్రిటన్ ఆర్థిక మార్కెట్లపై చర్చ - 2026' అనంతర ఉమ్మడి ప్రకటనకు ఆమోదం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 9:నాలుగవ బ్రిటన్ – ఇండియా ఫైనాన్షియల్ మార్కెట్స్ డైలాగ్ (ఎఫ్ఎండీ)ను 2026 సెప్టెంబర్ 29న లండన్‌లో నిర్వహించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ, హెచ్ఎం ట్రెజరీల సీనియర్ అధికారులు ఈ చర్చలకు నేతృత్వం వహించగా... సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ), భారత రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ), అంతర్జాతీయ ఆర్థిక సేవా సంస్థల ప్రాధికార సంస్థ (ఐఎఫ్ఎస్‌సీఏ), పింఛను, నిధుల నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (పీఎఫ్ఆర్‌డీఏ), భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార (ఐఆర్‌డీఏఐ), బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీవోఈ), ఫైనాన్షియల్ కండక్ట్ అథారిటీ (ఎఫ్‌సీఏ) సహా ఇరుదేశాల ఆర్థిక సేవల నియంత్రణ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2024 డిసెంబరులో నిర్వహించిన సమావేశ అనంతర పరిణామాల సమీక్షతో ఈ చర్చలు ప్రారంభమయ్యాయి. తమ తమ పరిధుల్లో చేపట్టిన సంస్కరణల సమాచారాన్ని ఇరుదేశాల ప్రతినిధులు వివరించారు. సుస్థిర ఆర్థిక వృద్ధి, పటిష్టమైన - పారదర్శకమైన ఆర్థిక మార్కెట్లు, ద్వైపాక్షిక వాణిజ్యం – పెట్టుబడులను మెరుగుపరచుకునేందుకు కట్టుబడి ఉన్నట్టు స్పష్టం చేశారు. మూలధన మార్కెట్లు, బీమా, పింఛన్లు, ఆస్తుల నిర్వహణ, ఫిన్‌టెక్ అంశాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. ఫిన్‌టెక్, ఏఐ, హరిత – సుస్థిర ఆర్థిక విధానం, ఆస్తుల నిర్వహణ వంటి రంగాల్లో ప్రస్తుత నియంత్రణ ప్రక్రియల భాగస్వామ్యంతో పాటు... విధాన నిర్ణేతలు, నియంత్రణ సంస్థలు, పరిశ్రమల మధ్య ఆచరణాత్మక సహకారంలో 'భారత్ – బ్రిటన్ ఆర్థిక భాగస్వామ్యం (ఐయూకేఎఫ్‌పీ)' పాత్రను ఇరువర్గాలు స్వాగతించాయి.

ఇరుదేశాల ప్రతినిధులు తమ పరిధిలో మూలధన మార్కెట్లలో చేపట్టిన సంస్కరణలను వివరించారు. భారత్ తరఫున... మార్కెట్ ప్రవేశం, నిర్వహణ ప్రక్రియలను క్రమబద్ధీకరించడం ద్వారా అంతర్జాతీయ పెట్టుబడిదారుల భాగస్వామ్యంలో వస్తున్న మార్పులను సెబీ వివరించింది. విదేశీ పెట్టుబడిదారులకు సార్వభౌమ, కార్పొరేట్ బాండ్ల సేకరణలో సౌలభ్యం మెరుగుపడడాన్ని ఆర్‌బీఐ వివరించింది. భారత్‌లోకి విదేశీ మూలధనాన్ని ఆకర్షించడంలో 'గుజరాత్ అంతర్జాతీయ ఆర్థిక టెక్-సిటీ అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రం (గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీ) పాత్రపైనా వారు చర్చించారు. అంతర్జాతీయ ఆర్థిక కేంద్రంగా గిఫ్ట్ ఐఎఫ్ఎస్సీని రూపుదిద్దేందుకు ఎప్పటికప్పుడు కావాల్సిన నియంత్రణపరమైన సహకారానికి, విజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. గిఫ్ట్ – ఐఎఫ్ఎస్‌సీ ద్వారా అంతర్జాతీయ ఈక్విటీలు, బాండ్ల నమోదుతోపాటు.. పెట్టుబడులు, భారతీయ సంస్థలకు అంతర్జాతీయ మూలధన మార్కెట్ల లభ్యత, వాటితో బలమైన అనుసంధానంపై ప్రతినిధులు చర్చించారు. తదుపరి 'ఎకనామిక్ అండ్ ఫైనాన్షియల్ డైలాగ్' భేటీకి ముందే.. భవిష్యత్తులో మూలధన మార్కెట్ల సహకారానికి సంబంధించి ప్రాధాన్యతా రంగాలను గుర్తించేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి.

ఇరుదేశాల ప్రతినిధులు తమ బీమా, పింఛను రంగాల సంస్కరణలతోపాటు మార్కెట్ అవకాశాలపై చర్చించారు. ఆర్థిక సేవల వృద్ధి, పోటీతత్వ వ్యూహంలో భాగంగా.. బీమా నియంత్రణ వ్యవస్థలో చేసిన తాజా మార్పులను, అలాగే పింఛను, యాన్యుటీ మార్కెట్లలో పరిణామాలను బ్రిటన్ వివరించింది. మరోవైపు భారత్... బీమా పరిధిని విస్తరించడం, పెట్టుబడులు, మార్కెట్ సామర్థ్యాన్ని పెంచడంపై తన లక్ష్యాలను వెల్లడించింది. బీమా రంగ అభివృద్ధి, ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల్లో సహకారం దిశగా... 2023లో రూపొందించిన 'బీమా, పింఛన్ల కార్య ప్రణాళిక' ప్రాధాన్యాన్ని ఇరుపక్షాలు అంగీకరించాయి.

పోటీతత్వంతో కూడిన పటిష్టమైన మార్కెట్లు, నిపుణుల సేవలు, వివిధ మూలధన వనరులు, పునర్బీమా సామర్థ్యం వంటి అంశాలు సంక్లిష్టమైన ప్రమాదాలను ఎదుర్కొనడానికీ, సుదీర్ఘ దేశీయ అభివృద్ధికీ ఎంతగానో తోడ్పడతాయన్న అభిప్రాయాన్ని ప్రతినిధులు వ్యక్తం చేశారు. భారత్‌లో రూపుదిద్దుకుంటున్న కొత్త నియంత్రణ విధానాల ద్వారా, లండన్ మార్కెట్ - భారతీయ బీమా, పునర్బీమా సంస్థల మధ్య పటిష్టమైన సహకారం ద్వారా.. పునర్బీమా రంగంలో లభిస్తున్న అవకాశాలపై ఇరుపక్షాలు చర్చించాయి.

పింఛన్ల నియంత్రణ, పాలన యంత్రాంగం, సామాజిక భద్రతా పరిధి విస్తరణ, దీర్ఘకాలిక పొదుపు సంస్కరణల్లో అనుభవాలను ఇరుదేశాల ప్రతినిధులు వెల్లడించారు. ప్రజా భాగస్వామ్యాన్ని పెంచేందుకు, లాభదాయకమైన దీర్ఘకాలిక పెట్టుబడులకు సహకరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు. దేశీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా ఉన్న రంగాల్లో విజ్ఞానాన్ని ఇచ్చుపుచ్చుకునేందుకూ ఇరుపక్షాలు అంగీకరించాయి.

ఆర్థిక వనరుల నిర్వహణ సంబంధిత నియంత్రణ విధానాలు, మార్కెట్ పరిణామాలపై బ్రిటన్, భారత్ చర్చించాయి. ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధుల నిర్వహణ కోసం నియంత్రణ విధానాల రూపకల్పన చర్యలను బ్రిటన్ వివరించింది. కాగా సెబీ, ఐఎఫ్ఎస్‌సీఏ తమ పరిధిలోని విధానాల్లో చేపట్టిన కీలక సంస్కరణలను భారత్ వివరించింది. ఆస్తుల నిర్వహణ రంగంలో నియంత్రణ సహకారాన్ని ఇరుపక్షాలు స్వాగతించాయి. సంస్కరణలు, పెట్టుబడిదారుల అవసరాలు, మార్కెట్ పరిస్థితులపై పరస్పర అవగాహన వల్ల విదేశీ పెట్టుబడులు పెరిగే తీరుపైనా చర్చించాయి. భారత రూపాయి అంతర్జాతీయీకరణ మరింత విస్తరించడాన్ని ఇరుదేశాలు స్వాగతించాయి. విదేశాల్లో రూపాయి ట్రేడింగ్‌లో లండన్ ప్రధాన కేంద్రంగా నిలిచి, కీలక పాత్ర పోషించడాన్ని ఇరుపక్షాలు అంగీకరించాయి. సుస్థిర ఆర్థిక వ్యవస్థకు సంబంధించి.. పర్యావరణ అనుకూల, వాతావరణ మార్పులను తట్టుకోగల ప్రాజెక్టుల కోసం ప్రైవేటు మూలధనాన్ని సమీకరించడంలో నమ్మకమైన విధానాలు, పారదర్శకంగా ఉండే ప్రకటనలు, అంతర్జాతీయ ప్రమాణాలు, పెట్టుబడిదారుల విశ్వాసం ప్రాధాన్యంపై ప్రతినిధులు చర్చించారు.

# ఆర్ఐఎన్ఎల్ భూముల ఇ-వేలానికి ముందు మాక్ ఇ-వేలం ద్వారా శిక్షణ నిర్వహించిన ఎన్ఎల్ఎంసీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 9:విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కార్పొరేట్ సంస్థ అయిన రాష్ట్రీయ ఇస్పత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)కు చెందిన 459 ప్లాట్ల ఇ-వేలానికి ముందు... బిడ్డర్లకు ఆన్‌లైన్ బిడ్డింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థల విభాగం (డీపీఈ) ఆధ్వర్యంలోని నేషనల్ ల్యాండ్ మోనెటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) ఈ నెల 6న విశాఖపట్నంలో ఒక భౌతిక నమూనా ఇ-వేలం ప్లాట్‌ఫారమ్ శిక్షణను నిర్వహించింది.

ఆసక్తిగల బిడ్డర్లకు, ఇతర భాగస్వాములకు అనుకరణ విధానంలో ఇ-వేలం ప్లాట్‌ఫామ్‌ను గురించి పూర్తి అవగాహన కలిగించడం కోసం ఈ ప్రత్యక్ష శిక్షణను నిర్వహించారు. ఈ సెషన్‌లలో బిడ్డింగ్ ఇంటర్‌ఫేస్, పాల్గొనే విధానం, ఆన్‌లైన్ వేలం ప్రక్రియ సంబంధిత ఇతర కీలక అంశాలనూ వివరించారు. ప్రత్యక్ష వేలానికి ముందు... వేలంలో పాల్గొనాలనుకునే వారు ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆచరణాత్మక అవగాహనను పొందగలిగారు.

ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన ఆసక్తి గల బిడ్డర్లు ఈ శిక్షణలో పాల్గొనేందుకు వీలుగా... ఈ రోజు ఎన్ఎల్ఎంసీ ఆన్‌లైన్ మాక్ ఇ-వేలం ప్లాట్‌ఫారమ్ శిక్షణనూ నిర్వహించింది. ఈ నెల 12, 16 తేదీల్లో జరగనున్న ప్రత్యక్ష వేలం ప్రక్రియకు ముందే... వేలంలో పాల్గొనాలనుకునే వారు డిజిటల్ బిడ్డింగ్ విధానంపై అవగాహన పొందే అవకాశాన్ని ఈ ఆన్‌లైన్ సెషన్ కల్పించింది. ఆర్ఐఎన్ఎల్ భూములకు సంబంధించిన రెండు దశల ఇ-వేలం ప్రక్రియకు కొద్ది రోజుల ముందు ఈ మాక్ ఇ-వేలం కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మొదటి దశ వేలం ఈ నెల 12న ఉదయం 11:00 గంటల నుంచి సాయంత్రం 7:00 గంటల వరకు... రెండో దశ వేలం ఈ నెల 16న ఉదయం 11:00 గంటల నుంచి సాయంత్రం 7:00 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎల్ఎంసీ సీఈవో శ్రీ రోహన్ చంద్ ఠాకూర్ మాట్లాడుతూ... ప్రత్యక్ష వేలానికి ముందు ఆసక్తి గల బిడ్డర్లు డిజిటల్ బిడ్డింగ్ ప్రక్రియ గురించి పూర్తి అవగాహన పొందేలా భౌతిక, ఆన్‌లైన్ మాక్ ఇ-వేలం సెషన్‌లను నిర్వహించడం కీలక ముందడుగని పేర్కొన్నారు. ఆసక్తి గల బిడ్డర్లకు ప్లాట్‌ఫారమ్‌ను అర్థం చేసుకోవడానికి, నిర్దేశిత కాలపరిమితుల్లో అవసరమైన లాంఛనాలను పూర్తి చేయడానికి తగిన అవకాశాన్ని కల్పిస్తూ... వేలం ప్రక్రియను మరింత పారదర్శకంగా, అందుబాటులో ఉండేలా, పాల్గొనేవారికి అనుకూలంగా మార్చడమే మా ప్రయత్నం అని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్ఐఎన్ఎల్ భూముల వేలం ఒక ముఖ్యమైన అసెట్ మోనెటైజేషన్ అవకాశాన్ని అందిస్తుందన్నారు. ప్రొఫెషనల్, పారదర్శక, నిర్మాణాత్మక విధానంలో ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి ఎన్ఎల్ఎంసీ కట్టుబడి ఉందని శ్రీ రోహన్ ఠాకూర్ తెలిపారు.

ఆర్ఐఎన్ఎల్ భూముల జాబితాలో విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ... మద్దిలపాలెం, గాజువాకలోని ఆటో నగర్ వంటి ప్రాంతాల్లో... మొత్తం 93,572.21 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన 459 అత్యుత్తమ శ్రేణి (ప్రీమియం), ఎటువంటి చట్టపరమైన వివాదాలు లేని ప్లాట్లు ఉన్నాయి. ఈ ప్లాట్ల విస్తీర్ణం సుమారు 128.94 చదరపు గజాల నుంచి 2,728 చదరపు గజాల వరకు ఉంటుంది. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో కొనుగోలుదారులకు అనేక రకాల ఎంపికలు లభిస్తాయి. రైల్‌టెల్ ఇ-నివిడియా ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ ద్వారా పారదర్శకమైన, పోటీతత్వంతో కూడిన ఇ-టెండర్-కమ్-ఇ-వేలం ప్రక్రియతో ఈ ప్రాపర్టీలను కేటాయిస్తారు.

# టీబీ ముక్త గ్రామ పంచాయతీగా తలారివానిపల్లి ఎంపిక

**జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు..**
**గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో మరో ముందడుగు**




మెదక్, అక్టోబర్ 9: బెజ్జంకి మండలంలోని తలారివానిపల్లి గ్రామ పంచాయతీ టీబీ (క్షయ) ముక్త గ్రామ పంచాయతీగా జాతీయ స్థాయిలో ఎంపికై అరుదైన గుర్తింపును సాధించింది. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ గండికోట సురేష్ సన్మానం అందుకున్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ గండికోట సురేష్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సహకారం, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది నిరంతర కృషితోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. తలారివానిపల్లి గ్రామం టీబీ ముక్త గ్రామ పంచాయతీగా జాతీయ స్థాయిలో ఎంపిక కావడం గ్రామ ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు.

గ్రామంలో క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడం, వ్యాధి లక్షణాలపై చైతన్యం తీసుకురావడం, అవసరమైన వైద్య సేవలు అందించడం వంటి చర్యల్లో గ్రామ, మండల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది కీలక పాత్ర పోషించారని తెలిపారు. వారి సమన్వయంతో చేపట్టిన నిరంతర కార్యక్రమాల ఫలితంగానే గ్రామానికి ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, టీబీ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని సర్పంచ్ గండికోట సురేష్ తెలిపారు. ఈ జాతీయ స్థాయి గుర్తింపు గ్రామానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



వరంగల్, అక్టోబర్ 9:జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్పా గ్రాండ్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 148 కంపెనీల ప్రతినిధులు పాల్గొని, సుమారు 12 వేల ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఇంటర్వ్యూలు చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి యువత భారీగా తరలి రావడంతో జాబ్ మేళా ప్రాంగణం సందడిగా మారింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, విమానయాన తదితర రంగాల్లో ఉద్యోగాలు పొందేందుకు యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, డీసీసీ అధ్యక్షుడు కర్ణాకర్, మున్సిపల్ చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, మధు, భువన సుందర్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. రాజేందర్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, జిల్లా అధికారులు, కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# శక్తి స్వరూపిణి బతుకమ్మ







ప్రతి పండుగ పరంపరానుగతంగా ప్రత్యేక శైలిలో, విశిష్ట పద్ధతిలో జరుపుకునే ధార్మిక కార్యాచరణాసక్తుల నిలయమైన తెలంగాణలో అపురూప సోదరీమణులైన జేష్టాదేవి, లక్ష్మి దేవిలను కొలుస్తూ, బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలను భక్తి శ్రద్ధలతో, పిల్లా పాపలతో కలిసి మహిళలు జంట పండుగలుగా పక్షం రోజుల తేడాతో నిర్వహించడం అనాదిగా ఆచరిస్తున్న సనాతన సాంప్రదాయం. బతుకునిచ్చే తల్లిని లక్ష్మి గౌరి దేవిలను అభేదిస్తూ, శక్తి రూపంగా ఆటపాటల ద్వారా పూజిస్తూ, ఉన్నంతలో రకరకాల పదార్థాలను నివేదిస్తూ, కొత్త బట్టలు నగలు ధరిస్తూ, ఆడ బిడ్డలను ఆహ్వానిస్తూ, కలిసి జరుపుకునే పండుగ బతుకమ్మ. బతుకమ్మను పేర్చే విధానం, పూజించే తీరును బట్టి, తనను ఆరాధించడానికే శక్తిమాత ఆ రూపాన్ని కోరిందా అని అనిపిస్తుంది. శ్రీ చక్ర ఉపాసన సర్వోత్కృష్టమైన శక్తి ఆరాధన విధానాలలో ఒకటి.

బతుకమ్మను పేర్చేటప్పుడు, కమలం షట్చక్షికం/ అష్టదళ పద్మాన్ని వేసి పేర్చడం ఆనవాయితీ. శ్రీచక్రం లోని మేరు ప్రస్తానం బతుకమ్మ ఆకారాన్ని పోలి ఉంటుంది. శ్రీచక్రం లోని కుండలినీ యోగ విశేష శక్తిగా బతుకమ్మలో గౌరమ్మను నిలపడం చేస్తారు. ప్రధానంగా తెలంగాణ స్త్రీలు గౌరమ్మను,గౌరీ, లక్ష్మి సరస్వతులుగా త్రిగుణాత్మ స్వరూపిణిగా భావించి పూజిస్తారు.

**"శ్రీలక్ష్మి నీమహిమలూ గౌరమ్మ భారతి సతివయ్యి బ్రహ్మకిల్లాలిపై పార్వతి దేవివై పరమేశు రాణివై, భార్యవైతివి హరునకు గౌరమ్మా అంటూ పాడుకోడవడం విశేషం".** భాద్రపద అమావాస్య మహాలయ అమావాస్య లేక ఎంగిలిపూల బతుకమ్మ అని పిలుస్తూ, ఆనాటితో ప్రారంభించి మహర్న వమితో ముగించ బడే బతుకమ్మ పండుగ, ఆట పాటలతో నిర్వహించి, పిల్లా పాపలతో మహిళలు తన్మయత్వం పొందుతారు. ప్రతిరోజు వివిధ పిండి వంటలను ఆరగించడం చేత అనారోగ్యం పాలు కాకుండా ఉండేందుకు అర్రెమి పేరుతో ఆరవ రోజు సెలవు తీసుకుంటారు.

ఇళ్లలో ప్రతిరోజు ఒకరిని మించి మరొకరు పోటీలు పడుతూ గ్రామ పొలి మేరలో, పంట చేలలో, ఇళ్ళల్లో, పరిసర ప్రాంతాలలో లభ్యమయ్యే తంగేడు, గునుగు, బంతి, గన్నేరు, కట్ల, గోరింట, గుమ్మడి తదితర పూలతో పసుపు గౌరమ్మ దేవతా విగ్రహాన్ని పళ్ళెములో అందంగా, ఆకర్షణీయంగా పేర్చుతారు. నిత్య నూతన వస్త్ర దారులై, సాయంత్రం వేళ, బృందాలుగా పలు రకాల

పిండి వంటలతో ఊరి బయటకు, జలాశయాల వద్దకు వెళతారు. మధ్యలో బతుకమ్మలను ఉంచి వృత్తాకారంలో ఆడుతూ, పాడుతూ లయ బద్దంగా అడుగులేస్తూ, పదానికి పదం కలుపుతూ, శాస్త్రీయంగా నృత్యం చేస్తారు.

వెంట తెచ్చుకున్న తిను బండారాలను ముందుగా నైవేద్యం పెట్టి, బతుకమ్మను నీటిలో నిమజ్జనం గావిస్తారు. అనంతరం పిండి వంటలను తోటివారికి పంచుతూ, పిల్లలతో ఒకేస్థలంలో కూర్చుండి ముత్తయిదులు సామూహికంగా ఆరగిస్తారు. సాయంత్రమంతా ఆహ్లాదకర వాతావరణంలో గడిపి, చీకటి పడ్డాక ఇళ్లకు చేరుకుంటారు

. **"చేమంతి వనములో భామలు చెలికుంటలో భామలు, ఓలలా డినారు"** అంటూ గొల్ల భామలు - శ్రీకృష్ణుడు పాటలు;

**"రాత్రి వచ్చిన సాంబ శివుడు ఎంతటి మాయల వాడే అమ్మ, "చిత్తూ చిత్తుల బొమ్మ శివుడీ ముద్దుల గుమ్మ బంగారు బొమ్మ దొరికెనమ్మ ఈ వాడలోన"**

అంటూ శివ పార్వతుల గురించి; బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ

**ఉయ్యాలో.. ఒక్కేసి పువ్వేసి చందమామ** అంటూ

బతుకమ్మ గూర్చి; **"జనకునింటి ఉయ్యాలో"** అంటూ భూజాత యైన మహాసాధ్వి సీతాదేవి గురించే గాక **"కలవారి కోడలు కలికి కామాక్షి"** అంటూ సామాజిక అంశాల సమస్యలపై సైతం జాన పద బాణీలో బృందగానం చేసే సాంప్రదాయ గీతాలు మంత్ర ముగ్ధులను గావిస్తాయి.

అన్ని వర్గాలు కలిసి ఆడడంలో మానవ సంబంధాలు, సమిష్టి భావనలు పెంపొందడంతో పాటు భారత దేశ ఔన్నత్యాన్ని తెలంగాణ ప్రాశస్త్యాన్ని తెలిపే సాంస్కృతిక వారసత్వం తరతరాలుగా కొన సాగుతున్నది. కౌటుంబిక, చారిత్రక, పౌరాణిక, సంబంధ బాంధవ్యాల, సామాజిక అంశాలతో ఉన్న జానపద పాటల వల్ల అపురూప సాహిత్యాన్ని, వారసత్వాన్ని భావి తరాలకు అందించడం జరుగు తున్నది.

కుల, మత, వర్గ, పేద, ధనిక భేదాలు లేకుండా, సమిష్టిగా, సామూహికంగా ప్రకృతి ఆరాధన భాగంగా జరుపుకునే బతుకమ్మ పండుగ చర్విత చర్వణంగా

సాగుతున్న నిత్య లౌకిక జీవనంలో ఒకింత మార్పు తెస్తూ, నూతనో త్సాహం, సోదర భావాన్ని అలౌకిక ఆనందాన్ని అన్నింటిని మించి సామూహిక భాగ స్వామ్యాన్ని పెంపొందించ గలదనే పరిపూర్ణ విశ్వాసంతో, బతుకమ్మ వేడుకలను మహిళలు ఆనందోత్సవాలతో ఏ యేటి కాయేడు పాల్గొంటున్నారు.



**-రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

## బతుకమ్మ వైభవం

వాకిళ్లు రంగవల్లులను
అద్భుతంగా అలుకుకున్నాయి
మోములు చిరునవ్వులను
చిత్రంగా పులుముకున్నాయి
గాజుల చేతులు
చప్పట్ల సవ్వడులను చిలుకుతున్నాయి
బంగారు పల్లాలు
రంగు పూలను అలుముకున్నాయి
పాదాలు లయబద్ధంగా నేలను తడుముతున్నాయి
ఇంతుల కోకిల గొంతుకలు
సాంస్కృతిక వారధులవుతున్నాయి
పూలు సొగసుగా వచ్చి
తెలంగాణ వైభవాన్ని
ప్రపంచానికి తెలుపుతున్నాయి.



**-చింతల శ్రీనివాస గుప్త.**
9440037125.

## సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన..



ఆదిలాబాద్, అక్టోబర్ 9 దనస్తూరాబాద్ మండలనీలోని రాంపూర్, బూత్కూర్ గ్రామాల్లో సేంద్రీయ వ్యవసాయంపై ధనుకా కంపెనీ సైంటిస్ట్ శంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులపై రైతులకు వివరించారు.

రసాయనాల వాడకం తగ్గించి భూసారాన్ని పెంచుకోవాలని నిపుణుల పిలుపు మేరకు సదస్సుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన రాంపూర్, బూత్కూర్ గ్రామాల రైతులు తరలి వచ్చారు. దస్తురాబాద్ మండల కేంద్ర పరిధిలోని రాంపూర్, బూత్కూర్ గ్రామాలలో రైతన్నలకు సేంద్రీయ సాగుపై ధనుకా కంపెనీ ప్రతినిధులు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత రోజుల్లో విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడటం వల్ల సాగు ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని, అదే సమయంలో భూములు నిస్సారంగా మారుతున్నాయని కంపెనీ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో రైతులు తక్కువ పెట్టుబడితో.. ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో అధిక దిగుబడులు ఎలా సాధించవచ్చో క్షేత్రస్థాయిలో వివరించారు. పంట పొలాల్లోనే చార్టులు ప్రదర్శిస్తూ, మొక్కల పెరుగుదల దశలను చూపిస్తూ.. భూమిలో సేంద్రీయ కర్బనాన్ని (సారాన్ని) పెంచే ధనుకా కంపెనీ జీవ ఉత్పత్తుల గురించిన సమాచారాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకం, సమగ్ర పోషక యాజమాన్యం ద్వారా సాగు ఖర్చులను సగానికి పైగా తగ్గించుకోవచ్చని స్పష్టంచేశారు. ఈ సదస్సులో రాంపూర్, బూత్కూర్ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, నిపుణులను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇందులో ధనుక కంపెనీ ఏ ఎస్ ఎం నగేష్, ఎస్ ఓ ప్రవీణ్ ఫర్టిలైజర్ నిర్వాహకులు ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## బతుకమ్మ, దసరా పండుగల వేళ ప్రత్యేక ఆర్టిసి బస్సుల్లో 50 శాతం అధిక ఛార్జీలు వసూలు చేయడం సామాన్యులపై భారం

### రేవంత్ రెడ్డి ఇదేనా ప్రజాపాలన-బీజేపీ

ములుగు, అక్టోబర్ 9:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఆడపడుచులు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ, దసరా పండుగల సమయంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం వరకు అధిక ఛార్జీలు వసూలు చేయడం సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపడమేనని బీజేపీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవీంద్రాచారి విమర్శించారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటారని, ఇలాంటి పండుగ సమయంలో ప్రయాణ ఖర్చులు పెరగడం వల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై భారం పడుతుందని పేర్కొన్నారు.

ప్రత్యేక పండుగ బస్సులకు సాధారణ ఛార్జీల కంటే 1.5 రెట్లు వరకు ఛార్జీలు వర్తించే విధానంపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని, అధిక ఛార్జీల విధానాన్ని పునఃసమీక్షించి ప్రయాణికులపై భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం, పండుగల సమయంలో ప్రత్యేక బస్సుల్లో అధిక ఛార్జీల వల్ల సామాన్య ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ములుగు జిల్లా కేంద్రంలోని బస్ స్టేషన్‌లో సాయంత్రం 6 గంటల తర్వాత హనుమకొండ నుంచి ములుగు, ఏటూరునాగారం, మంగపేట వెళ్లే ప్రయాణికులు తీవ్ర రద్దీతో ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు ఆర్టిసి అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ములుగు నియోజకవర్గ మంత్రి సీతక్క వెంటనే స్పందించి ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని, పండుగల పేరుతో పెంచిన ఛార్జీలను రద్దు చేయాలని, హిందూ పండుగల సమయంలో ప్రజలకు ఎలాంటి ప్రయాణ ఇబ్బందులు లేకుండా మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలు కల్పించాలని శ్రీలమంతుల రవీంద్రాచారి డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం పట్ల తన ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ చూపించాలని ఆయన కోరారు.

## వర్ణమాల బతుకమ్మతో నాంపల్లి పాఠశాలలో సందడి



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 9:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలంలోని నాంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా వర్ణమాలతో బతుకమ్మను తయారు చేయడం జరిగింది అదేవిధంగా ప్రముఖ జానపద కళాకారుని సోకులాడి సిట్టమ్మి ఫేమ్ స్నేహ కట్కూరి బతుకమ్మ పాటలతో ఆడి పాడారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వత్సల ,ఉపాధ్యాయులు ఉమాదేవి ,రజిత ,వినయ్ కోల, శైలజ, సన లు,. విద్యార్థులు మరియు విద్యార్థులు తల్లిదండ్రులు ఉత్సాహంగా ఆడి పాడారు

## కేన్సర్ మందుల ధరల నియంత్రణను విస్తరించిన ప్రభుత్వం.. క్యాన్సర్ రోగులకు వార్షికంగా రూ. 2,500 కోట్లు ఆదా అయ్యే అవకాశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 9:షెడ్యూల్డ్ జాబితాలో లేని క్యాన్సర్ నిరోధక ఔషధాల సరఫరా, విక్రయాలలో వసూలు చేసే లాభాల శాతంపై గరిష్ఠ పరిమితిని విధించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఈ లాభాల శాతాలు గరిష్ఠ రిటైల్ ధరలో (ఎంఆర్‌పీ) 30 శాతానికి పరిమితం చేసింది. ఈ చర్య ద్వారా మందుల ధరలు 70 శాతం వరకు తగ్గుతాయని.. క్యాన్సర్ రోగులు సొంత జేబు నుంచి వెచ్చించే సొమ్ము గణనీయంగా తగ్గి వార్షికంగా రూ. 2,500 కోట్లు ఆదా అవుతాయన్న అంచనా ఉంది.

షెడ్యూల్డ్ జాబితాలో చేర్చిన అత్యవసర క్యాన్సర్ మందులపై ఇప్పటికే ప్రభుత్వం కఠినమైన గరిష్ఠ ధరల నిబంధనలను అమలు చేస్తోంది. తాజా నిర్ణయం ద్వారా ఆ జాబితాలో లేని మందులు అంటే నాన్‌షెడ్యూల్డ్ మందులకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. రోగులకు చేరే వరకు ఈ ఔషధాల విషయంలో లాభాల శాతాన్ని ఇది పరిమితం చేస్తుంది.

ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ (డీజీహెచ్ఎస్) ఆధ్వర్యంలోని నిపుణుల కమిటీ ఈ జాబితాలో చేర్చాల్సిన మందులను ఖరారు చేస్తుంది. ఆ తర్వాత నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) తగిన నిర్ణయం తీసుకుని అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేస్తుంది. భారత్‌లో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. ప్రతి లక్ష మంది జనాభాలో దాదాపు 60 మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ చికిత్స రోగులతో పాటు వారి కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతోంది. వారు తరచుగా సొంత జేబుల నుంచి భారీ మొత్తాలను వెచ్చించాల్సి వస్తోంది.నాన్-షెడ్యూల్డ్ క్యాన్సర్ నిరోధక ఔషధాలపై సగటున దాదాపు 170 శాతం వరకు అధిక ధర ఉంటోందని.. కొన్ని సందర్భాల్లో ఇది 700 శాతం లేదా అంతకంటే ఎక్కువకు చేరుకుంటోందని మార్కెట్ డేటాపై ఎన్‌పీపీఏ చేసిన విశ్లేషణలో తేలింది. సరళంగా చెప్పాలంటే.. ఆయా మందుల ధర సరఫరా గొలుసులోనే రోగులకు చేరేలోపు విపరీతంగా పెరుగుతోంది.అలాగే ఆ మందులను రిటైల్ ఫార్మసీ, ఆసుపత్రి ఫార్మసీ లేదా ఆన్‌లైన్ ఫార్మసీ లలో ఎక్కడ కొనుగోలు చేస్తున్నారనే దానిని బట్టి కూడా ధరల్లో గణనీయమైన తేడాలు ఉంటున్నాయి.

లేనివి అనే అన్ని వర్గాల షెడ్యూల్ చేయని క్యాన్సర్ నిరోధక మందులు ఈ కొత్త పరిమితి లోకి వస్తాయి. తక్కువ ధరల ద్వారా రోగులు గణనీయమైన లబ్ధి పొందేలా చూడటంతో పాటు వారికి అవసరమైన మందులు ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరం అందుబాటులో ఉండేలా ఇది తోడ్పడుతుంది.రోగులకు మరింత తక్కువ ధరలకు మందులు అందేలా చూసుకు ంటుంది.ఈ లాభాలను పరిమితం చేయడం ద్వారా రోగులకు ఎంత ఎక్కువ ఉపశమనం లభిస్తుందో ప్రభుత్వం గతంలో తీసుకున్న చర్యలు స్పష్టం చేస్తున్నాయి.2019 ఫిబ్రవరిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌పీపీఏ.. ఔషధాల (ధరల నియంత్రణ) ఉత్తర్వు- 2013 లోని పేరా 19 కింద ఎంపిక చేసిన 42 షెడ్యూల్ చేయని క్యాన్సర్ నిరోధక మందులపై వాణిజ్య లాభాలను పరిమితం చేసింది.

ఆ నిర్ణయం ద్వారా గరిష్ట రిటైల్ ధరలు (ఎంఆర్‌పీ) 91 శాతం వరకు తగ్గాయి. 526 బ్రాండ్‌ల పరిధిలో వార్షికంగా రూ. 984 కోట్ల ఆదా అయినట్లు నివేదికలు వచ్చాయి. ఇది క్యాన్సర్ రోగులపై ఉన్న ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిం చింది.. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచింది.దీని నుంచి ప్రేరణ పొంది సరఫరా గొలుసులో గుర్తించిన ధరల సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వం ఇప్పుడు మరింత విస్తృతమైన ధరల పరిమితిని ఆమోదించింది. ఇప్పుడు వార్షికంగా రూ. 2,500 కోట్లు ఆదా అవుతాయన్న అంచనా ఉంది. ఇది క్యాన్సర్ చికిత్స పొందుతున్న రోగులకు మరింత పెద్ద ఉపశమనాన్ని కలిగిస్తుంది.మందుల ఉత్పత్తిని నిలకడగా కొనసాగించడం, నిరంతరం అందుబాటులో ఉండేలా చూసేందుకు చర్యలు(ప్రాణాలను రక్షించే ఈ మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చూసేందుకు షెడ్యూల్ చేయని క్యాన్సర్ నిరోధక ఔషధాల తయారీదారులు తమ ప్రస్తుత ఉత్పత్తి స్థాయిలను యథావిధిగా కొనసాగి ంచాల్సి ఉంటుంది.బ్రాండెడ్, జనరిక్, దేశీయంగా తయారైనవి, దిగుమతి చేసుకున్నవి, పేటెంట్ పొందినవి, పేటెంట్ లేనివి అనే అన్ని వర్గాల షెడ్యూల్ చేయని క్యాన్సర్ నిరోధక మందులు ఈ కొత్త పరిమితిలోకి వస్తాయి. తక్కువ ధరల ద్వారా రోగులు గణనీయమైన లబ్ధి పొందేలా చూడటంతో పాటు వారికి అవసరమైన మందులు ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరం అందుబాటులో ఉండేలా ఇది తోడ్పడుతుంది.

## క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 9:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వేములవాడలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని గౌరవించాలని సూచించారు. ప్రిన్సిపాల్ వెంకటేష్ మాట్లాడుతూ, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యతను, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. వేడుకలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపింది.

## 'మీ భూమి.. మీ హక్కు.. హక్కు కాపాడే బాధ్యత మాది'

### 40.58 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశాం: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 9:రైతు అర్జీలు పట్టుకుని అధికారుల చుట్టూ తిరగకుండా.. హలం పట్టుకుని పొలానికి వెళ్లేలా పాలన ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రైతుల భూములకు పూర్తి రక్షణ కల్పించడమే ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం నర్సింగోలులో శుక్రవారం పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 'మీ భూమి?మీ హక్కు' గ్రామ సభలో పాల్గొని లబ్ధిదారులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు."మీ భూమి.. మీ హక్కు.. భూమి మీదే.. హక్కు మీదే. ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. ఇది సీబీఎన్ మార్క్" అని చంద్రబాబు పేర్కొన్నారు. రైతులు తమ భూముల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 40.58 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశామని సీఎం తెలిపారు. ఒక్క అక్టోబర్‌లోనే 793 గ్రామాల్లో 4.58 లక్షల మందికి పాస్‌పుస్తకాలు అందించామన్నారు. ప్రకాశం జిల్లాలో 24,116 పాస్‌పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. పాస్‌పుస్తకాల పంపిణీకి అధికారులకు లక్ష్యాలు నిర్దేశించామని, నిర్దేశిత టార్గెట్‌ను పూర్తి చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్యపాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.